

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా




సామాన్యుడి ఆయుధంగా






సంపుటి - 07 | సంచిక 243 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం, 02, ఆగస్టు 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్










# మహిళలపై మోజు.. పడుతున్నారు




మహిళలను టార్గెట్ చేస్తున్న కొంతమంది పోలీసులు

పోలీసు వ్యవస్థను అప్రతిష్ట పాలు చేస్తున్నారు

పోలీసు వ్యవస్థపై ప్రజలకు భిన్నాభిప్రాయాలు కలుగుతున్నాయి

మహిళలకు రక్షణగా నిలవాల్సిన వాళ్లే మానభంగాలు చేస్తున్నారు !

వరుస కేసులు వెలుగులోకి వస్తున్న భయం లేకుండా పోతుంది

సమస్యలపై స్టేషన్కు వస్తున్న మహిళలను చెరపడుతున్నారు !

మహిళల మాన, ప్రాణ,ధనాన్ని లాక్కుంటున్నది ఎవరు

మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న స్టేషన్స్ అధికారులు

ఖాకీలా వింత వ్యవహారంతో పోలీస్ డిపార్ట్మెంట్ పరువుకు భంగం కలుగుతుంది

పదవి, అధికార దుర్వినియోగం

సబబేనా : డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

దేశంలో మహిళలకు రక్షణ కరువైతుందని డాక్టర్ బరిగెల శివ ఆవేదన వ్యక్తం చేశారు.దేశంలో మహిళల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలు, మానభంగాలు,అత్యాచారాలు,పెరుగుతూనే ఉన్నాయని మహిళలు అనుభవిస్తున్న మానసిక వేదనలు విశ్వవ్యాప్తంగా వెలుగు చూస్తున్నాయన్నారు.పోలీస్ వ్యవస్థలో మహిళల పట్ల అసభ్యకరమైన సంఘటనలు,మహిళలను లోపరుచుకునే సంఘటనలు,మహిళలను శారీరకంగా వాడుకునే సంఘటనలు విపరీతంగా పెరిగిపోతున్నాయని తెలిపారు.ఈ మధ్యకాలంలో ఏ రాష్ట్రంలో చూసిన ప్రతి పోలీస్ స్టేషన్లో స్టేషన్స్ అధికారులు మహిళల పట్ల దురుసుగాను, అహంకారంగాను, ప్రవర్తిస్తూ రక్షణ కల్పించాల్సిన పోలీసులే మహిళలను శారీరకంగా వాడుకుంటున్నారని పెద్ద ఎత్తున నిందలు వస్తున్నాయని తెలిపారు. చాలా చోట్ల పోలీస్ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను ట్రాప్ చేస్తుండటమే కాకుండా సమస్యల మీద సంక్షోభంలో ఉండి స్టేషన్లను ఆశ్రయిస్తున్న మహిళలను కిందిస్థాయి పోలీస్ నుండి మొదలుకొని పైస్థాయి సిఐల వరకు శారీరకంగా వాడుకోవడం షరా మామూలుగా నడుస్తుందని - మిగతా 2లో..



డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్




## తెలంగాణ రైజింగ్-2047'లో భాగస్వామ్యం అవ్వండి

ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం సమష్టి కృషితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

సీఎస్ఆర్ ద్వారా కీలక పాత్ర పోషించాలని కార్పొరేట్ సంస్థలకు పిలుపు

సదరన్ ఇండియా రీజినల్ కాన్ఫరెన్స్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్'లో మంత్రి శ్రీధర్ బాబు




2

## తల్లి పాలే శిశువుకు తొలి టీకా

తల్లిపాల శ్రేష్టతను గుర్తించాలి

ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయాలి

అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు



2

## ఒక్కరోజులో రెండు లక్షలు దాటిన మీసేవ లావాదేవీలు

తొలిసారి రికార్డు స్థాయిలో మీసేవ కార్యకలాపాలు

దేశంలోనే నెంబర్ వన్ గా మీసేవ ఆన్లైన్ ప్లాట్ ఫార్మ్

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

7



## చెరువుల పునరుద్ధరణతో మారుతున్న రూపురేఖలు

నల్ల చెరువు పునరుద్ధరణపై సిఎం రేవంత్ హర్షం

హైదరాబాద్,ఆగస్ట్1(జై భీమ్ న్యూస్):

చెరువుల పునరుజ్జీవంతో రూపురేఖలు మారుతున్న మన హైదరాబాద్‌ను చూడటం ఎంతో సంతృప్తినిచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నగరంలోని చెరువులకు జీవం పోస్తూ, భావి తరాలకు మెరుగైన భవిష్యత్తును అంకితం చేస్తున్న హైడ్రా పనితీరును ఆయన అభినందించారు. ఉప్పల్ నల్ల చెరువు పునరుజ్జీవానికి అహర్నిశలు శ్రమించిన హైడ్రా అధికారులకు, సిబ్బందికి సీఎం రేవంత్ రెడ్డి తన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. చెరువులను పరిరక్షించడం అంటే కేవలం నీటి వనరులను కాపాడటం మాత్రమే కాదని, అది భావి తరాల భవిష్యత్తును భద్రపరచడమేనని ఆయన స్పష్టం చేశారు. ప్రతి చెరువును కంటికి రెప్పలా కాపాడుకుంటూ.. ప్రతి అంగుళం ప్రజా ఆస్తిని సంరక్షిస్తూ తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని సీఎం చెప్పారు. నగరంలోని జలవనరుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# తల్లి పాలే శిశువుకు తొలి టీకా

**తల్లిపాల శ్రేష్ఠతను గుర్తించాలి**
**ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయాలి**
**అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు**

**హైదరాబాద్,ఆగస్ట్1(జై భీమ్ న్యూస్):**

పుట్టిన గంటలోపే తల్లిపాలు ప్రారంభించాలి.. తొలి ఆరు నెలలు తల్లిపాలే ఇవ్వాలని మంత్రి సీతక్క అన్నారు. అంగన్వాడీ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి సీతక్క అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతి తల్లి, ప్రతి కుటుంబానికి తల్లిపాల ప్రాముఖ్యతను చేరవేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. తల్లి పాలు ప్రతి శిశువుకు తొలి హక్కు, ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ పోషకాహారమని మంత్రి పేర్కొన్నారు. పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు శిశువుకు తొలి రోగనిరోధక టీకాలా పనిచేస్తాయని తెలిపారు. ప్రతి శిశువుకు పుట్టిన గంటలోపే తల్లిపాలను ప్రారంభించడం, తొలి ఆరు నెలలు కేవలం తల్లిపాలే ఇవ్వడం, అనంతరం వయస్సుకు తగిన అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్లు తల్లిపాలను కొనసాగించడం ద్వారా పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బలమైన పునాది ఏర్పడుతుందని మంత్రి చెప్పారు. తల్లి పాల వారోత్సవాలను కేవలం అధికారిక కార్యక్రమాలుగా కాకుండా ప్రజల్లో చైతన్యం కలిగించే ఉద్యమంగా నిర్వహించాలని మంత్రి సీతక్క సూచించారు. రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, గ్రామాలు, వార్డుల్లో అవగాహన సమావేశాలు, ఇంటింటి సందర్శనలు, కమ్యూనిటీ కార్యక్రమాలు నిర్వహించి తల్లిపాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, సూపర్వైజర్లు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శించి గర్భిణీలు, బాలింతలు, ఆరు నెలల లోపు శిశువుల తల్లులు, రెండేళ్ల లోపు పిల్లల తల్లులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వాలని మంత్రి సూచించారు. తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగిస్తూ శాస్త్రీయ అవగాహన కల్పించాలని, కుటుంబ సభ్యులను కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని కోరారు. ప్రసవం జరిగిన ప్రతి ఆసుపత్రిలో పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు అందేలా వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని మంత్రి ఆదేశించారు. తల్లి పాల ప్రోత్సాహంలో అంగన్వాడీ వ్యవస్థ కీలక పాత్ర పోషించాలని, ప్రతి అంగన్వాడీ కేంద్రం తల్లి శిశు ఆరోగ్యానికి మార్గదర్శక కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు. పోషకాహార లోపం లేని తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి శిశువుకు ఆరోగ్యవంతమైన జీవితానికి తల్లి పాలే బలమైన పునాది అని అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయడంలో ప్రజాప్రతినిధులు, వైద్యులు, మహిళా సంఘాలు, అంగన్వాడీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, ప్రతి కుటుంబం భాగస్వాములు కావాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలు అందించేలా సమాజమంతా బాధ్యతతో ముందుకు రావాలని కోరారు.

# తెలంగాణ రైజింగ్-2047'లో భాగస్వామ్యం అవ్వండి

**ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం సమష్టి కృషితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి**
**సీఎస్ఆర్ ద్వారా కీలక పాత్ర పోషించాలని కార్పొరేట్ సంస్థలకు పిలుపు**
**సదరన్ ఇండియా రీజినల్ కాన్ఫరెన్స్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్'లో మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్,ఆగస్ట్1(జై భీమ్ న్యూస్):**

కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) ద్వారా 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యసాధనలో భాగస్వామ్యం కావాలని కార్పొరేట్ సంస్థలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం సమష్టిగా కృషి చేస్తేనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ), హైదరాబాద్ ఛాప్టర్ ఆధ్వర్యంలో కొండాపూర్ లోని తెలంగాణ కాంట్రాక్టర్స్ కల్చరల్ క్లబ్ లో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న '50వ సదరన్ ఇండియా రీజినల్ కాన్ఫరెన్స్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్'ను శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... 'తెలంగాణ రైజింగ్-2047' అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, సమాజంలోని అన్ని వర్గాల భాగస్వామ్యంతో సాకారమయ్యే అభివృద్ధి విజన్ అని వివరించారు. ఆర్థిక వృద్ధితో పాటు సామాజిక పురోగతి సమాంతరంగా సాగేలా... ఆవిష్కరణల ద్వారా ఉపాధి అవకాశాలు సృష్టించేలా... అభివృద్ధి ప్రతి నియోజకవర్గానికి, దాని ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరేలా ఈ బృహత్తర ప్రణాళికను రూపొందించామన్నారు. ఈ లక్ష్య సాధనలో ప్రభుత్వం... పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ రంగం భాగస్వామ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. సీఎస్ఆర్ ద్వారా సమాజంలో మార్పు తెచ్చే కార్యక్రమాల అమలుకు, పరిశ్రమల స్థాపనకు సంబంధించి ప్రతి దశలోనూ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు భాగస్వామిగా, సహాయకారిగా ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబు భరోసానిచ్చారు. ఏఐ, డేటా గవర్నెన్స్, సైబర్ భద్రత వంటి అంశాలు కార్పొరేట్ ప్రపంచంలో కొత్త సవాళ్లుగా మారుతున్న నేపథ్యంలో కంపెనీ సెక్రటరీలు... కేవలం కంప్లయన్స్ నిపుణులుగా కాకుండా స్ట్రాటజిక్ బోర్డ్ అడ్వైజర్లుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కంపెనీలు కేవలం లాభార్జనే కాకుండా... సస్టైనబుల్, ఎథికల్ వ్యాపార వృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన కాన్స్టిట్యూయెన్సీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్( సీడీఎక్స్)కు నాలెడ్జ్ పార్ట్ నర్ గా ఉండేందుకు ముందుకొచ్చిన ' ఇన్స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా' ప్రతినిధులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని కార్పొరేట్ కంపెనీలు, సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఎస్ఐ ప్రతినిధులు మహదేవ్ తిరునగరి, ఎం.దామోదరన్, శిల్పా, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ కారిడార్‌గా ఉపయోగపడ్డ మెట్రో

హైదరాబాద్,ఆగస్ట్1(జై భీమ్ న్యూస్): హైదరాబాద్ మెట్రో రైలు కేవలం నగరవాసులను గమ్యస్థానాలకు చేర్చే రవాణా వ్యవస్థగానే కాకుండా, అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడే సంజీవనిలా మరోసారి తన మానవతా దృక్పథాన్ని చాటుకుంది. తీవ్రమైన ట్రాఫిక్ చిక్కులను అధిగమించి, అవయవ మార్పిడి చికిత్స కోసం దాత నుంచి సేకరించిన గుండె, ఊపిరితిత్తులను సురక్షితంగా , వేగంగా ఆసుపత్రికి తరలించేందుకు ప్రత్యేక 'గ్రీన్ కారిడార్'గా మారింది. గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దాత నుంచి సేకరించిన గుండె , ఊపిరితిత్తులను సికింద్రాబాద్ పరిధిలోని కిమ్స్ ఆసుపత్రికి అత్యవసరంగా తరలించాల్సి వచ్చింది. రోడ్డు మార్గంలో వెళ్తే ట్రాఫిక్ సమస్యల వల్ల సమయం వృథా అయ్యే ప్రమాదం ఉండటంతో వైద్యులు మెట్రో అధికారులను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన హైదరాబాద్ మెట్రో అధికారులు రాయదుర్గ్ మెట్రో స్టేషన్ నుంచి రసూల్‌పురా వరకు ప్రత్యేకంగా మెట్రో ట్రాన్సిట్‌ను ఏర్పాటు చేశారు. మార్గమధ్యలో ఉన్న 13 స్టేషన్లను దాటుకుంటూ, కేవలం 25 నిమిషాల్లోనే 14 కిలోమీటర్ల దూరాన్ని అత్యంత వేగంగా పూర్తి చేసి అవయవాలను సురక్షితంగా చేర్చారు.

# మహిళలపై "మోజు" పడుతున్నారు

మొదటి పేజీ తరువాయి

దేశ ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. చట్టాలకు న్యాయస్థానాలకు లోబడి మహిళలను రక్షించుకోవాలని ఎన్నో అవగాహన సదస్సులు నిర్వహించబడుతున్నప్పటికిని మహిళలను రక్షించాల్సిన స్టేషన్స్ పోలీసు అధికారులే కొంతమంది కావాలని మహిళలను లోపరచుకుంటున్నారని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా ప్రతి స్టేషన్ లో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని పొద్దస్తమానం మహిళలపై వేధింపులు ఎక్కువ అవుతున్నాయన్నారు.తెలంగాణ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో మహిళల స్థితిగతులను గమనించాల్సి వచ్చినప్పుడు తెలంగాణలో వరంగల్ జిల్లాకు సంబంధించి గతంలో పోలీస్ కమిషనర్ గా విధులు నిర్వహించిన పోలీస్ కమిషనర్ ఏవి రంగనాథ్,తనతోపాటు ఆయా ప్రాంతాల్లో సిపీలుగా పనిచేసిన అధికారులు పోలీస్ శాఖలో పనిచేసే మహిళల పట్ల అక్రమ సంబంధాలు కొనసాగించిన కొంతమంది సిఐలపై కఠిన చర్యలు తీసుకొన్నారని, కొంతవరకు పోలీస్ వ్యవస్థలో అలాంటి చర్యల వల్ల మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు కట్టడి చేయగలిగినారని అలాంటిది పూర్తిస్థాయిలో జరగకుండా ప్రయత్నాల్లో భాగంగానే మిగిలిపోగా అధికారులు మారుతున్న సందర్భాల్లో స్టేషన్స్ అధికారులు వాళ్ల విచ్చలవిడితనాన్ని కొనసాగిస్తూనే ఉన్నారని అలాంటి అధికారుల వల్ల పోలీస్ శాఖ అవమానానికి గురవుతుందన్నారు.ప్రతి పోలీస్ స్టేషన్లో బాధితులుగా మారుతున్న మహిళలను లోపరుచుకునే ప్రయత్నాలు చేస్తున్న అధికారుల మీద పోలీస్ ఉన్నతాధికారులు చాలా తక్కువ శాతంలో దృష్టి పెడుతున్నారని వాటి వల్లనే ఇలాంటి సంఘటనలు ఎక్కువగా పెరుగుతున్నాయని అన్నారు.ముఖ్యంగా క్షణికావేశంలో పోలీస్ స్టేషన్లకు వస్తున్న మహిళలను ,అత్తలను కోడల్లను, ఎంతవరకు వాడుకోవాలో ఎంతవరకు డబ్బులు గుంచుకోవాలి అంతా బరితెగింపుతనం జరుగుతుందని తులసి వనంలో గంజాయి మొక్కల లెక్క పోలీస్ స్టేషన్లో పనిచేసే సిబ్బంది కంచే చేను మేసినట్లుగా చేస్తున్నారని ఖాకీ ముసుగులో మహిళల ధన, మాన, ప్రాణాలను దోచుకుంటూ బయటి వ్యక్తుల వలె అఫీషియల్ గా దొంగలు, రేపిస్టులు ప్రవర్తిస్తున్న ప్రవర్తనను కొనసాగిస్తున్నారని నిలదీశారు.పోలీస్ డిపార్ట్మెంట్లో పనిచేసే పైస్థాయి మహిళా ఉన్నతాధికారులు ఎంత మంచి ఉన్నత అధికారిని కూడా కిందిస్థాయి మహిళా పోలీస్ సిబ్బందికి గాని,పోలీస్ స్టేషన్లకు వచ్చే బాదిత మహిళలకు గాని ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టడం లేదని అలాంటి సందర్భంలోనే మహిళలు అవమానపరచబడుతున్నారంటూ,బాధిత మహిళలతో ఉన్నతాధికారులు కనీసం మాట్లాడటం లేకపోవడంతో బాధిత మహిళలకు రక్షణ అనేది చీకట్లో టార్చ్ లైట్ వేసి చూసిన కనిపించడం లేని విధంగా జరుగుతుందని పేర్కొన్నారు.మల్కాజిగిరి సీపి బడుగుల సుమతి ఐపీఎస్ తెలంగాణ రాష్ట్ర ఉమెన్ వింగ్ సేఫ్టీ అథారిటీగా పనిచేసిన సందర్భంలో రాష్ట్రంలోనే కాకుండా దేశంలో మహిళల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలను అక్రమ సంబంధాలను రేపిస్టు సంఘటనలను అణిచివేయడానికి అరికట్టడానికి తన వంతుగా పూర్తిస్థాయి బాధ్యతలను నిర్వహించినారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ శాఖలో మహిళా సిబ్బంది ఎదుర్కొంటున్న లైంగిక దాడులపై అవగాహన కార్యక్రమాలు ఎక్కువ స్థాయిలో ఏర్పాటు చేస్తే బాగుండేదని పోలీస్ శాఖలో పనిచేస్తున్న మహిళా సిబ్బంది బాధలు వెలుగులోకి వచ్చేవన్నారు.పోలీస్ వ్యవస్థలో ఏ శాఖ అయినా బయట మహిళల మీద జరిగే ఆగడాల మీద రెక్కీలు,సమీక్షలు నిర్వహిస్తున్నారు తప్ప డిపార్ట్మెంటులలో పోలీస్ స్టేషన్లో జరిగే అకృత్యాల మీద అఘాయిత్యాల మీద దృష్టి పెట్టలేకపోవడం కొసమెరుపుల మిగిలిపోతుందన్నారు.ఏ చరిత్ర చూసిన ఏముంది గర్వకారణం అన్నట్లుగా ఆడవాళ్లకు ఆడవాళ్లే శత్రువుగా ఉన్నట్లు మహిళలను రక్షించాల్సిన పోలీస్ డిపార్ట్మెంట్లో కూడా మహిళా సిబ్బందిపై ఇలాంటి ఆగడాలు కొనసాగుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో మహిళల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలను ప్రభుత్వాల దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేశారు.మహిళల పట్ల జరుగుతున్న దారుణాలను,అక్రమ సంబంధాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై పోలీసు ఉన్నతాధికారులపై ఉందని పోలీసు వ్యవస్థను పటిష్టపరిచే క్రమంలో మహిళల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలను అక్రమ సంబంధాలను నిర్మూలిస్తూ కట్టడి చేయాలని కోరారు.

**ఖాకీలా కామాంధులా.?.రక్షణ కోసం వస్తే భక్షిస్తారా.?**

తెలంగాణలో ఖాకీలు గాడితప్పుతున్నారు.పోలీసు స్టేషన్‌కు వస్తున్న మహిళలతో అనుచితంగా ప్రవర్తిస్తున్నారు. రక్షణ భటులు భక్షుల్లా మారుతున్నారు. న్యాయం కోసం పీఎస్ మెట్లెక్కితే అన్యాయానికి గురైతున్నారు. సాయం కోసం వచ్చే మహిళలే టార్గెట్ చేస్తూ కీచకుల్లా తయారైతున్నారు.కుటుంబ సమస్యలతో, వేధింపులతో పీఎస్కు వచ్చే మహిళల బలహీనతలను అవకాశంగా మార్చుకుంటూ కామాంధులలాగా వ్యవహరిస్తున్నారు. కేసులు పేరులో బాధిత మహిళల నెంబర్లు తీసుకుని వేధిస్తున్నారు. తమ కామా కోరికలు తీర్చాలంటూ హింసలకు గురిచేస్తున్నారు. న్యూడ్ కాల్స్ చేయాలంటూ మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారు. అక్రమ సంబంధాలతో అడ్డదారులు తొక్కుతూ,పోలీస్ స్టేషన్‌లను పోలీసు అధికారులు తప్పుడు పనుల అడ్డంగా మార్చుతున్నారు. రాష్ట్రంలో కొందరు పోలీస్ ల తీరు ఆ శాఖకు కళంకం తెస్తోంది. ఖాకీ చొక్కాను అడ్డం పెట్టుకుని తప్పుడు పనులు చేస్తూ పోలీస్ శాఖను అభాసు పాల్టేస్తున్నారు. చాలా పోలీస్‌స్టేషన్‌లకు అవినీతి జబ్బుపట్టుకుంది. సీఎస్‌కు వచ్చే ఫిర్యాదుదారుల నుంచే కాదు,అక్రమదందాలు చేసే వారి నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారు.స్టేషన్ల ఖర్చులతో పేరుతో వసూళ్ళు చేస్తూ అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రతి ఏటా పోలీసుశాఖలో నేరాలు పెరుగుతున్నాయి..పోలీస్ స్టేషన్‌లో మహిళలపై దారుణాలు జరుగుతున్నాయి..రాష్ట్రంలో కంచే చేను మేసినట్లు పోలీసుల తీరుంది..రక్షించాల్సిన పోలీసులే భక్షకులుగా మారితే ఇక అభాగ్యులకు రక్షణ ఎక్కడుంటుంది.?.పోలీస్ వ్యవస్థ ఇవాళా కొంత మంది అధికారుల వల్ల భ్రష్టుపట్టుతోంది. సమాజంలో వ్యవస్థీకృత నేరాల కంటే పోలీస్ స్టేషన్లో మహిళలపై నేరాలు పెరుగుతోన్నాయి. క్రైమ్ ను కంట్రోల్ చేయాల్సిన పోలీసులే నేరాలకు పాల్పడుతున్నారు. తెలంగాణలో సాయం కోసం వస్తున్న మహిళలపై పోలీసు స్టేషన్‌లోనే వేధింపులు జరుగుతున్న తీరు రాష్ట్ర పోలీసు వ్యవస్థ తీరుతెన్నులకు అద్దం పడుతోంది. అవినీతి, అక్రమాలు, అసభ్య ప్రవర్తనలతో పోలీస్ శాఖ నిత్యం వార్తల్లో నిలుస్తుంది. రాష్ట్రానికి, పోలీసు వ్యవస్థకు మచ్చ తెచ్చేలా కొంతమంది పోలీసులు కామంతో మహిళల పట్ల కీచకుల్లా వ్యవహరిస్తున్నారు.కింద స్థాయి పోలీసులే కాదు, పెద్ద పెద్ద చదువులు చదివి దేశంలో ప్రతిష్టాత్మకమైన సివిల్ సర్వీస్ ఎగ్జామ్స్ రాసి ఐపీఎస్‌ల స్థాయి అధికారులు కూడా గాడి తప్పుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో గత కొంతకాలంగా పోలీస్ శాఖపై అనేక ఆరోపణలు వస్తున్నాయి.మరీ ముఖ్యంగా మహిళలపై కొంతమంది కీచక పోలీస్‌లు తీరు జుగుప్సకరంగా ఉంది. రక్షకభటుల నిలయంలోనే మహిళకు రక్షణ లేకుండా పోయింది. రక్షించాల్సిన పోలీసులే కామాంధుల్లా మారి భక్షిస్తున్నారు. పోలీసులందరూ ఇలాగే ఉంటారని కాదు, తులసి వనంలో అనేక గంజాయి మొక్కలున్నాయి.ఇటీవలె పోలీసులపై వస్తున్న ఆరోపణలు ఇందుకు నిదర్శనం.. పోలీస్ స్టేషన్‌కు న్యాయం కోసం వచ్చే మహిళలతో అక్రమ సంబంధాలు పెట్టుకోవడమే కొంత మంది పోలీసుల పనిగా మారింది..బయట సమాజంలో వేధింపులు ఎదుర్కొంటున్న మహిళలు పోలీస్ స్టేషన్ కు వస్తే అక్కడ కూడా పోలీసు శాఖలో కీచకుల వేధింపులు రెట్టింపులో ఉన్నాయి. రాష్ట్రంలో పోలీసులు దారి తప్పుతున్నారు.అవినీతి కేంద్రాలుగా,వేధింపులు కేంద్రాలుగా మార్చుతున్నారు. పచ్చిగా చెప్పాలంటే కీచక పర్వాలకు వేదికలుగా మార్చుతున్నారు. మహిళలు పోలీస్టే స్టేషన్‌కు వస్తే వాళ్లతో పరిచయం పెంచుకుని సన్నిహితంగా ఉండగా ఫొటోలు, వీడియోలు తీయడం లైంగిక దాడులు చేయడం,బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు వసూలు చేయడం పోలీస్ శాఖ సిగ్గుపడేలా చేస్తున్నారు. తనపై ధరించిన నాలుగు సింహాలు తలదించుకునేలా చేస్తున్నారు. పీఎస్‌లోనే మద్యం మాంసం సేవించడం, జల్సాల కేంద్రాలుగా మార్చుతున్నారు. ఒక రకంగా పబ్బుల్లా మార్చుతున్నారు..బయట నుంచి న్యాయం కోసం వచ్చే మహిళలకే కాదు,పోలీస్ శాఖలో పనిచేసే మహిళల ఉద్యోగులకు కూడా రక్షణ లేకుండా పోయింది. మహిళ కానిస్టేబుల్స్, ఎస్సైలు, ట్రైనీ ఎస్సైలు సొంత డిపార్ట్‌మెంట్‌లో రక్షణలేదంటూ బహాటంగానే విమర్శలు చేస్తున్నారు.పై అధికారులు, సీనియర్ల వేధింపులు తట్టుకోలేక చాలా మంది ఆత్మహత్యాయత్న ప్రయత్నాలు చేస్తున్నట్లు నిత్యం వార్తలు వస్తున్నాయి. సొంత డిపార్ట్‌మెంట్‌లో మహిళలపై కూడా లైంగిక వేధింపులు పెరుగుతున్నట్లు రికార్డ్‌లు చెపుతున్నాయి. ట్రైనీలపై సీనియర్లు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు. ఐపీఎస్ స్థాయి నుంచి కింది స్థాయి వరకూ వేధింపులకు గురైతున్నారు. స్వయంగా ఐఏఎస్, ఐపీఎస్ శిక్షణ కేంద్రాల్లో కూడా మహిళా ఐపీఎస్‌కు రక్షణ లేదు. ఐపీఎస్‌కు సెలెక్టైనా శిక్షణలో లైంగిక, మానసిక ,శారీరక వేధింపులకు గురైతున్న అనేక ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిపై వేధింపుల ఉదాంతం పోలీస్ వ్యవస్థను ఎక్కిరిస్తుంది. డిపార్ట్‌మెంట్‌లో, శిక్షణ కేంద్రాల్లోనే మహిళకు రక్షణ లేదంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు ఖాకీ యూనిఫామ్‌ను కొందరు తప్పుడు పనులకు, అడ్డదారి పనులకు కోసం ఉపయోగిస్తున్నారు. ఖాకీ డ్రెస్‌కున్నపై గౌరవాన్ని దిగజార్చుతున్నారు. మహిళలపై వేధింపులకు, అక్రమ సంబంధాలకు, కబ్జాలకు, సివిల్ దందాలకు, అవినీతికి అక్రమ సంపాదన, బ్లాక్‌మెయిల్ బెదిరింపుల కోసం మిస్ యూజ్ చేస్తున్నారు. కొంత కాలంగా అనేక మంది పోలీసులపై లైంగిక వేధింపులు, అవినీతి ఆరోపణలతో. పదుల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. మరీ ముఖ్యంగా అక్రమ సంబంధాలు, బ్లాక్‌మెయిల్ ఆరోపణలు ఎక్కువొస్తున్నాయి. పోలీస్ స్టేషన్లు దందాలకు, సెటిల్‌మెంట్లకు అడ్డగా మారింది..సివిల్ తగదాల్లో పోలీసులు మితిమీరిన జోక్యం చేసుకుంటున్నారు. లంచాలకు కేరాఫ్ అడ్రస్ మారుతున్నాయి. అనేక మంది స్టేషన్ అధికారులను ఏసీబీ రెడ హ్యాండెండ్‌గా పట్టుకుంది.నచ్చని వారిపై అక్రమ కేసులు పెట్టి వేధించడం ఎక్కువైంది. పోలీస్ బాస్ హెచ్చరిస్తున్నా తీరు మారడం లేదు. యూనిఫామ్‌ను అడ్డుపెట్టుకుని సాయం కోసం వచ్చే మహిళను లొంగదీసుకోవడం, లైంగిక దాడికి పాల్పడం, అక్రమ సంబంధాలు పెట్టుకుని బ్లాక్ మెయిల్ చేయడం, న్యూడ్ కాల్స్ అంటూ వేధించడమే కాదు, దందాలకు సెటింల్‌మెంట్‌కు లంచాలకు అడ్డగా పీఎస్ మారమేకాదు పోలీస్ స్టేషన్‌లు లాకప్ డెత్‌లు, థార్డ్ డిగ్రీలతో యవకూపాల్లా మారాయి. కొంతమంది పోలీసులు మామూళ్ల మత్తులో ఊగుతూ, పదోన్నతి కోసం, ట్రాన్స్ ఫర్ల కోసం రాజకీయ పార్టీలకు ఊడిగం చేస్తూ అమాయకులను విచక్షిణ రహితంగా కొట్టుతున్నారు. అనుమానాస్పద మృత్యువులు, కస్టడీ మరణాలు, పోలీసుల వేధింపుల వల్ల బాధితులు డెత్‌లతో పోలీస్ స్టేషన్లను మృత్యువు కేంద్రాలుగా మార్చుతున్నారు. తెలంగాణలో కర్ల రాజేష్, మరియమ్మ లాకప్ డెత్‌లు, ఏపీలో గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్‌లు పోలీస్ స్టేషన్లను కొందరు అధికారులు డెత్ సెంటర్స్‌గా మార్చుతున్నారు.ఇలా తెలుగు రాష్ట్రాల్లో పోలీసులు కీచకుల్లా వ్యవహరిస్తున్నారు..రక్షణ కోసం పీఎస్ కు వస్తున్న మహిళలకు రక్షణ లేకపోవడమే కాదు, పోలీసులే భక్షకుల్లా మారడం ఆందోళన కలిగించే అంశం. పోలీస్ బాస్‌లు దీన్ని గుర్తించకుండా కంచే చేను మేసినట్లు చేస్తే ప్రజలు పోలీస్‌శాఖపై తిరబడే పరిస్థితి వస్తుంది.

రాష్ట్రం / కేంద్రపాలిత ప్రాంతం లో పనిచేస్తున్న మహిళా పోలీసు అధికారులు,సుమారుగా రాష్ట్రవ్యాప్తంగా క్రింది విధంగా కలరు.

1 ఆంధ్రప్రదేశ్ 18,748
2 అరుణాచల్ ప్రదేశ్ 1,172
3 అస్సాం 2,819
4 బీహార్ 19,471
5 ఛత్తీస్‌గఢ్ 5,119
6 గోవా 761
7 గుజరాత్ 11,381
8 హర్యానా 5,811
9 హిమాచల్ ప్రదేశ్ 1,573
10 ఝార్ఖండ్ 2,182
11 కర్ణాటక 8,129
12 కేరళ 3,748
13 మధ్యప్రదేశ్ 7,323
14 మహారాష్ట్ర 31,685
15 మణిపూర్ 1,337
16 మేఘాలయ 600
17 మిజోరం 550
18 నాగాలాండ్ 759
19 ఒడిశా 5,165
20 పంజాబ్ 7,574
21 రాజస్థాన్ 9,499
22 సిక్కిం 468
23 తమిళనాడు 17,164
24 తెలంగాణ 3,709
25 త్రిపుర 1,133
26 ఉత్తరప్రదేశ్ 35,587
27 ఉత్తరాఖండ్ 2,231
28 పశ్చిమ బెంగాల్ 10,448
29 అండమాన్ ·నికోబార్ దీవులు 484
30 చండీగఢ్ 1,335
31 దాద్రా, నగర్ హవేలీ, దమన్ ·దీయూ 101,
32 ఢిల్లీ 11,217.
33 జమ్మూ,కాశ్మీర్ 1,058
34 లడఖ్ 646.
35 లక్షద్వీప్ 26.
36 పుదుచ్చేరి 216.

మొత్తం (ఆల్ ఇండియా)
మహిళా సివిల్ పోలీసుల సంఖ్య: 2,31,229

అన్ని రాష్ట్రాల మొత్తం పోలీసు బలం (సివిల్ పోలీస్, ఆర్మ్డ్ పోలీస్,టోటల్ పోలీస్ స్ట్రెంత్, మహిళా శాతం) ఈ విధంగా ఉన్నటువంటి మహిళా అధికారులు ప్రతి రాష్ట్రంలో మహిళా సిబ్బంది రక్షణ పట్ల,రాష్ట్ర పరిధిలలోని మహిళల పట్ల వాళ్ల మాన ప్రాణ ధనం రక్షణ కల్పించడంలో పూర్తిస్థాయిలో నిమగ్నం అవ్వాలని ఇలాంటి మహిళా అధికారులు పోలీస్ శాఖకు ఆశించిన స్థాయి ఫలితాలను తీసుకు రాగలరని కోరారు.



# నారాయణలో.....ఘనంగా ఇన్వాలేషన్





**విద్యార్థుల భవిష్యత్తు నిర్మానంలో అధ్యాపకుల పాత్ర కీలకం.**

**ఆకర్షణగా నిలిచిన మార్చ్ ఫాస్ట్ విన్యాసం-ఏసిపి నరసింహారావు**

**విద్యా పరిజ్ఞానంతోనే ఉన్నత లక్ష్యాలు సాధ్యం**

**విద్యార్థులు క్రమం తప్పకుండా క్రమశిక్షణను అలవర్చుకోవాలి**

**విద్యార్థులు సమాజం పట్ల అవగాహన పెంచుకోవాలి-డీజీఎం రిజ్వాన ఇమ్రాన్**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్:**

కార్పొరేట్ విద్య వ్యవస్థ నారాయణలో ఘనంగా ఇన్వాలేషన్ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హనుమకొండ జిల్లా పి నరసింహారావు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్( ఎసిపి), అదేవిధంగా డిప్యూటీ జనరల్ మేనేజర్ రిజ్వానా ఇమ్రాన్, నగరంలో నక్కలగుట్ట సమీపంలో ఉన్న నారాయణ స్కూలుకు హాజరయ్యారని ప్రిన్సిపాల్ రాజశేఖర్ ప్రకటనలు తెలిపారు, ఈ సందర్భంగా ఏసీపీ,పి నరసింహారావు మాట్లాడుతూ... విద్యార్థులు విద్యతోపాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని, విద్యార్థులకు సూచించారు, నేటి బాలలే రేపటి పౌరులు అనే నినాదాన్ని నిజం చేయాలన్నారు, ప్రతి విద్యార్థి విద్యలో ఉన్నత స్థాయిలో ఎదిగి.. తల్లిదండ్రుల ఆశయాన్ని నెరవేర్చాలన్నారు ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం ఏర్పరచుకొని విద్యాభ్యాసించాలన్నారు. విద్యాభ్యాసం, క్రమశిక్షణ సమపాలుగా అలవర్చుకొని పాటించడంలో విద్యార్థులు ఎక్కడ వెనకాడకూడదని సూచించారు.సమాజం వేగవంతంగా ముందుకు నడుస్తుందని మంచి అలవాట్లలతో సమాజంలో ఎదగాలని సూచించారు.ఏ విద్యాసంస్థలోనైనా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే అవకాశం అధ్యాపకులకే దక్కుతుందని అలాంటి సదవకాశాలను ఉపయోగించుకోవడంలో విద్యాసంస్థలతో ఏకీభవిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని అధ్యాపకులను ఉద్దేశించి తెలిపారు.విద్యార్థులు ఎదిగే క్రమంలో సమాజం పట్ల ఎంతో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని విద్యార్థులు ఎదుగుదలలో పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులు ప్రోత్సాహంతో కూడిన సహకారం అందించాలని సూచించారు ఈ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహించిన కార్యనిర్వాహక సభ్యులను పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు .ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల వరంగల్ జోనల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రిజ్వాన ఇమ్రాన్ మాట్లాడుతూ.... ప్రతి విద్యార్థి సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని, సమాజానికి ఆదర్శప్రాయంగా ఎదగాలని హితావు పలికారు.పాఠశాల అవలంబిస్తున్న క్రమశిక్షణను తూచా తప్పకుండా పాటించాలని సూచించారు.విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఎదగడమే నారాయణ విద్యాసంస్థల లక్ష్యమని పేర్కొన్నారు.నారాయణ విద్యాసంస్థలు శక్తివంచన లేకుండా విద్యార్థుల ఎదుగుదలకు దోహదపడుతుందని దానికి పూర్తి నిదర్శనంగా విద్యాసంస్థ నిర్వహిస్తున్న అన్ని రకాల కార్యక్రమాలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. లేకుండా రాజ్యాంగం పట్ల ఓటు హక్కు వినియోగం పట్ల ప్రతి విద్యార్థి అవగాహన కల్పించుకోవాలన్నారు అనంతరం క్యాబినెట్ ఎన్నికల విజయం సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు బ్యాడ్జిలు ధరింపజేసి శుభాకాంక్షలు తెలిపారు,ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశేఖర్, కోఆర్డినేటర్స్, సాయి కృష్ణ,శ్యామల,శిరీష, లక్ష్మతి,ఏవో ఆదిల్, అకాడమిక్ డీన్ వంశీ రమణ చారి,వైస్ ప్రిన్సిపాల్, అనూష,కరుణశ్రీ, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు కాకతీయ యూనివర్సిటీలో ఉచిత కోచింగ్

**ఆగస్టు 7 వరకు దరఖాస్తుల స్వీకరణ**

**అర్హులైన అభ్యర్థులు అవకాశం వినియోగించుకోవాలి**

**కేయూ రిజిస్టర్ , ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం**

**కేయూ క్యాంపస్, 1ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించనున్న ఎస్సై (ఎస్ఐ), కానిస్టేబుల్ నియామక పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్టడీ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తెలిపారు. శనివారం స్టడీ సెంటర్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగ సాధన దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు అవసరమైన అంశాలపై అనుభవజ్ఞులైన అధ్యాపకులచే సమగ్ర శిక్షణ అందించనున్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులకు సిలబస్‌కు అనుగుణంగా బోధన, మాక్ టెస్టులు, పరీక్షా విధానంపై అవగాహన, సమయ నిర్వహణ, ప్రశ్నల విశ్లేషణ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ





సందర్భంగా స్టడీ సెంటర్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పుల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆసక్తి కలిగిన అభ్యర్థులు నిర్ణీత నమూనాలో దరఖాస్తు ఫారమ్‌ను పూర్తి చేసి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టడీ సెంటర్‌లో సమర్పించాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ ఆగస్టు 1 నుంచి ఆగస్టు 7 వరకు మాత్రమే ఉంటుందని, గడువు ముగిసిన తర్వాత ఎలాంటి దరఖాస్తులు స్వీకరించబోమని స్పష్టం చేశారు. ఈ ఉచిత కోచింగ్‌కు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాలకు చెందిన అర్హులైన అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విషయ నిపుణులు, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువత ఈ అరుదైన అవకాశాన్ని వినియోగించుకొని నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని స్టడీ సెంటర్ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# పరకాల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలపై బీజేపీ ఆందోళన

**100 పడకల ఆసుపత్రిని వెంటనే ప్రారంభించాలని గాజుల నిరంజన్ డిమాండ్**

**పరకాల,1 ఆగస్టు 2026 జై (భీమ్ న్యూస్)**

పరకాల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఓ గర్భిణి మహిళ 108 అంబులెన్స్‌లోనే ప్రసవించాల్సి రావడం దురదృష్టకర సంఘటన అని బీజేపీ పరకాల పట్టణ శాఖ అధ్యక్షుడు గాజుల నిరంజన్ పేర్కొన్నారు. ఈ ఘటన ప్రభుత్వ వైద్య వ్యవస్థలో నెలకొన్న లోపాలను బహిర్గతం చేసిందని ఆయన విమర్శించారు. తల్లి, నవజాత శిశువు ప్రాణాలను సురక్షితంగా కాపాడిన 108 అంబులెన్స్ ఈఎంటీ భాస్కర్, పైలట్ అర్జున్‌ను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో వారి సేవలు ప్రశంసనీయమని అన్నారు. అయితే, కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన 100 పడకల నూతన ప్రభుత్వ ఆసుపత్రి ఇప్పటికీ ప్రజలకు అందుబాటులోకి రాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. ఆధునిక వైద్య సౌకర్యాలు ఉన్నప్పటికీ వాటిని వినియోగంలోకి తీసుకురాకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పరకాల నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలంటే వెంటనే 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించడంతో పాటు, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, నిపుణులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం తక్షణ చరలు తీసుకోవాలని గాజుల నిరంజన్ డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాట మాడకూడదని హెచ్చరిస్తూ, ఈ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే పరకాల ప్రజల తరఫున భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.





# పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

**కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎర్రబెల్లి స్వర్ణ, ఎంపీ డా. కడియం కావ్య**



**నర్సంపేట,1 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీనియర్ రాజకీయ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం నల్లబెల్లిలోని ఆయన నివాసానికి వెళ్లిన వారు పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు. అనంతరం ఆయన సతీమణి పెద్ది స్వప్నతో పాటు కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని మనోధైర్యం కల్పించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయ, సామాజిక రంగాలకు తీరని లోటని పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజా జీవితంలో ఎన్నో దశాబ్దాల పాటు ప్రజలతో మమేకమై పనిచేశారని, నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. ఆయన రాజకీయ జీవితంలో ప్రజాసేవకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని, అన్ని వర్గాల ప్రజల అభిమానాన్ని సంపాదించిన నాయకుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ, సమస్యలను ఓపికగా విని పరిష్కరించేందుకు కృషి చేసిన నాయకుడిగా పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. ఆయన చూపిన ప్రజాసేవా మార్గం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొని పెద్ది సుదర్శన్ రెడ్డికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో 'మై భారత్' నమోదు అవగాహన కార్యక్రమం విజయవంతం

**500 మందికి పైగా విద్యార్థుల నమోదు**

**'నషా ముక్త్ భారత్ అభియాన్'లో మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతిజ్ఞ**




**కేయూ క్యాంపస్, 1 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో 'మై భారత్' నమోదు అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. రమణ మార్గదర్శకత్వంలో, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్లు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈ. నారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు 'మై భారత్' పోర్టల్ లక్ష్యాలు, యువతకు అందుబాటులో ఉన్న అవకాశాలు, సామాజిక సేవలో భాగస్వామ్యం, నాయకత్వ లక్షణాల అభివృద్ధి, జాతీయ స్థాయి కార్యక్రమాల్లో పాల్గొనే విధానం, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించారు. దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని, ప్రభుత్వ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న యువజన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి విశేష స్పందన లభించగా, 500 మందికి పైగా విద్యార్థులు 'మై భారత్' పోర్టల్‌లో విజయవంతంగా నమోదు చేసుకుని తమ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలను పొందారు. విద్యార్థులలో జాతీయ చైతన్యం, సేవా భావం, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. అదేవిధంగా 'మై భారత్' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కల్పించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుమారు 60 మంది విద్యార్థులు ఆన్‌లైన్ ప్రతిజ్ఞ చేసి ధ్రువపత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారిణులు డా. డి. శైలజ, డా. ఎం. సౌజన్య మాట్లాడుతూ, విద్యార్థులు 'మై భారత్' పోర్టల్‌లో నమోదు చేసుకుని స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు, నాయకత్వ శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, జాతీయ స్థాయి యువజన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తమ వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డీలిమిటేషన్‌తో తమిళనాడుకు మోసం

**- ప్రజాస్వామిక హక్కులు దూరం చేసే యత్నం - విపక్షనేత రాహుల్ వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ,ఆగస్ట్1(జై భీమ్ న్యూస్):**

నియోజకవర్గ పునర్విభజన బిల్లును కేంద్రం మరోసారి పార్లమెంటు ముందుకు తీసుకురానుందన్న వార్తల నడుమ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. డీలిమిటేషన్‌ను తమిళనాడు ప్రజాస్వామిక హక్కులను దూరం చేసే కుట్రగా అభివర్ణించారు. తమిళనాడును బలహీనపరిచేలా బిల్లును రూపొందించారని అన్నారు. ఈ బిల్లును వీగిపోయేలా చేయాలని జాతీయ, ప్రాంతీయ పార్టీలకు పిలుపునిచ్చారు. బిల్లుకు మద్దతు ఇవ్వడమంటే తమిళనాడుకు ద్రోహం చేయడమేనని అన్నారు. తమిళనాడు వ్యక్తులు ఎవరూ ఈ బిల్లుకు మద్దతు ఇవ్వకూడదని అన్నారు. ప్రతి వ్యక్తీ బిల్లును వ్యతిరేకించాలని అన్నారు. ప్రతి తమిళపార్టీ, జాతీయ పార్టీ బిల్లు వీగిపోయేలా చేయాలని కోరారు. ఇటీవల పశ్చిమబెంగాల్, మహారాష్ట్రలోని పరిణామాల నేపథ్యంలో పార్లమెంటులో ఎన్డీయే బలం పెరిగిందన్న వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్రం మరోసారి మహిళా రిజర్వేషన్, నియోజకవర్గ పునర్ విభజన బిల్లులను పాస్ చేయించుకునేందుకు ప్రయత్నించవచ్చన్న కామెంట్స్ వినిపించాయి.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem

# ప్రజా సమస్యలను గుర్తించి ప్రజా పోరాటాలను నిర్మించాలి..

**మహనీయుల వారసత్వాన్ని ముందుకు నడపాలి.**
**అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీల నిర్మాణ ప్రక్రియను చేపట్టాలి.**
**నూతన తరాన్ని ఉద్యమంలోకి తీసుకొచ్చి శక్తివంతమైన సైన్యంగా తయారుచేసేందుకు ఎమ్మార్పీస్ శ్రేణులు శ్రమించాలి.**
**ఏపూరి వెంకటేశ్వర్ రావు మాదిగ,ఎమ్మార్పీస్ హనుమకొండ జిల్లా**



**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

మూడు దశాబ్దాలుగా పద్మ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో రాజీలేని పోరాటం చేసి ఎస్సి వర్గీకరణను సాధించడమే కాకుండా మాదిగలతో పాటు పేద వర్గాల సంక్షేమం కోసం ఉద్యమాలు నడిపి పలు అనేక సంక్షేమ పథకాలు సాధించిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం మత దురహంకారం, కుల వివక్షత, సాంఘిక అసమానతలు లేని సమ సమాజ నిర్మాణం కోసం పోరాడుతుందని, ప్రజా సమస్యలను గుర్తించి బలమైన ప్రజా పోరాటాలను నిర్మిస్తుందని ఎమ్మార్పిస్ హనుమకొండ జిల్లా ఇంచార్జి ఏపూరి వెంకటేశ్వర్ రావు మాదిగ మరియు జిల్లా కో ఇన్చార్జ్ తడుగుల విజయ్ మాదిగ అన్నారు.ఐనవోలు మండల కేంద్రంలో ఎమ్మార్పిస్,ఎంఎస్పీ అనుబంధ విభాగాల జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశానికి మండల ఇన్చార్జ్ బరిగల ఏలియా మాదిగ సభ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపూరి వెంకటేశ్వర్ రావు మాదిగ మాట్లాడుతూ... ఈదేశంలో దుర్మార్గమైన కుల వ్యవస్థ ఉండడం వలన వివక్షతకు గురై పేదరికంలోనే మిగిలిపోయామని, అణగారిన వర్గాల ఆర్థిక ఎదుగుదలకు పేదరికన్ని నిర్మూలించేందుకు ఉద్యమించాలని అన్నారు. రాజకీయ చైతన్యాన్ని సృహను విడువకుండా బలమైన ప్రజా పోరాటాలను నిర్మించాలని అందుకు గ్రామ స్తాయిలో అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పోరాడాలని అన్నారు.ఎమ్మార్పిస్ మరియు అన్ని అనుబంధ విభాగాల కమిటీలు రద్దు ఐనా సందర్బంగా నూతన గ్రామ కమిటీలు ఏర్పాటు చేసుకొని అన్ని అనుబంధ విభగాలను సంస్థగతంగా పునరనిర్మాణం చేసుకొని శక్తివంతంగా తయారు చేయాలని అన్నారు. నూతన విద్యార్థి, యువ తరాన్ని ఉద్యమంలోకి తీసుకోచ్చి క్షేత్ర స్థాయిలో శ్రమించాలని పిలుపునిచ్చారు.మహనీయుల ఆశయాల సాధనకి, పీడిత వర్గాల విముక్తికి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఇచ్చిన ఉద్యమ కార్యాచరన విజయవంతం కోసం నాయకులందరు పనిచేయాలని, నూతన కమిటీలు, అన్ని గ్రామాలు, మండలాలు, జిల్లా కమిటీలను ఏర్పాటు చేసుకొని బలంగా తయారు కావాలని అందుకు శ్రేణులు గ్రామాలకు తరలాలని కోరారు.ఈ కార్యక్రమంలో బండారి సురేందర్ మాదిగ,ఎమ్మెస్పి మాజీ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు,ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి బొక్కల నారాయణ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎస్పీ మండల కో ఇన్చార్జి ఇసురం బాబు,జిల్లా నాయకులు మరుపట్ల దేవదాస్,బరిగెల ఆరోగ్యం చింత ఏలియా, చంద్రమౌళి,డప్పు రమేష్,బొక్కల అనిల్,జలగం ఎల్ల కుమార్,సింగారం స్వామి వికలాంగుల అధ్యక్షులు మల్లేష్ ప్రవీణ్,నందనం ఎమ్మార్పిస్ అధ్యక్షులు కార్యదర్శి యాకర యాదగిరి,బర్ల బలరాం,దోమకొండ రమేష్, బర్ల యాదగిరి,ఐనవోలు ఎమ్మార్పిస్ అధ్యక్షులు మోలుగురి సంజీవ,గరిమెళ్ళ పెళ్లి అధ్యక్షులు గబ్బెట కుమారస్వామి పున్నెలు కందిక కట్టయ్య,పంతిని గద్దల బాబు,ముంజ నాగరాజు నరసింహులగూడెం అధ్యక్షులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శిగా ఇసంపల్లి అనిల్

**బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తానని వెల్లడి**



**గూడెపాడు, 1ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శిగా ఇసంపల్లి అనిల్ నియమితులయ్యారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయబ్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ సిల్వర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో హరిత హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతంతో పాటు బడుగు, బలహీన, దళిత వర్గాల అభ్యున్నతి కోసం అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం, సంక్షేమ కార్యక్రమాల అమలులో పార్టీ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సీ సెల్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని ఇసంపల్లి అనిల్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నందాను మర్యాదపూర్వకంగా కలిసిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత

**మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపిన సీపీ**



**జనగామ,1 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత (ఐపీఎస్) శనివారం జనగామ జిల్లా ఆర్అండ్‌బీ (ఆర్ అండ్ బీ) అతిథి గృహంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, జస్టిస్ సూరేపల్లి నందాకు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మర్యాదపూర్వకంగా పలకరించి, స్వల్పసేపు వివిధ అంశాలపై చర్చించారు. ఈ భేటీ మర్యాదపూర్వక సమావేశంగా కొనసాగింది.

## హనుమకొండలో దారుణం, భార్యను హత్య చేసిన భర్త

**కుటుంబ కలహాలే కారణం**
**కాళ్లు, చేతులు కట్టి మెడ కోసి హత్య, ఇద్దరు చిన్నారులు అనాథలు**

**హనుమకొండ ఆగస్టు 01/2026 (జై భీమ్ న్యూస్)**



హనుమకొండ జిల్లాలోని కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధి 4వ డివిజన్ కృష్ణ కాలనీలో శనివారం రాత్రి దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ వ్యక్తి తన భార్యను అత్యంత క్రూరంగా హత్య చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, నిందితుడు మేస్త్రీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సుమారు ఆరు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్న ఈ దంపతులకు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. అయితే కొంతకాలంగా కుటుంబ కలహాలు కొనసాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. శనివారం రాత్రి భార్య కాళ్లు, చేతులు కట్టి, అనంతరం మెడ కోసి హత్య చేసినట్లు సమాచారం. ఘటన అనంతరం సమాచారం అందుకున్న కాకతీయ యూనివర్సిటీ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హత్యకు గల ఖచ్చితమైన కారణాలు ఏమిటి? కుటుంబ కలహాలే ఈ దారుణానికి దారితీశాయా? అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

**ఇద్దరు చిన్నారుల భవిష్యత్తుపై ఆందోళన**

ప్రేమతో ప్రారంభమైన వారి దాంపత్య జీవితం చివరకు విషాదాంతంగా ముగియడంతో ఇద్దరు చిన్నారులు తల్లిని కోల్పోయి అనాథలయ్యారు. ఈ ఘటన స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

## ఘనంగా పాత్‌ఫైండర్ హై స్కూల్లో హెడ్ బాయ్,హెడ్ గర్ల్ మాక్ ఎన్నికల నిర్వహణ



**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

ఐనవోలు గ్రామంలోని పాత్‌ఫైండర్ హై స్కూల్ లో విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు మరియు బాధ్యతాయుత పౌరసత్వ భావన పెంపొందించేందుకు హెడ్ బాయ్, హెడ్ గర్ల్ మాక్ ఎన్నికలు శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల డైరెక్టర్ డా. ఎల్.ఎన్. ఎన్. వెంకటేశ్వరరావు హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించి, భవిష్యత్తులో బాధ్యతగల పౌరులుగా ఎదగాలని సూచించారు.పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.డి. సుభానుద్దీన్ మాట్లాడుతూ, పాఠశాల స్థాయిలో ఇటువంటి మాక్ ఎన్నికలు నిర్వహించడం ద్వారా విద్యార్థులు ఎన్నికల విధానం, ప్రచారం, ఓటింగ్ ప్రక్రియ మరియు ఫలితాల ప్రకటన వంటి అంశాలను ప్రత్యక్షంగా అవగాహన చేసుకుంటారని తెలిపారు.ఈ ఎన్నికల్లో ఉపాధ్యాయులు ఎన్నికల అధికారులుగా బాధ్యతలు నిర్వర్తించగా, విద్యార్థులు అభ్యర్థులు మరియు ఓటర్లుగా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఓటింగ్ ప్రక్రియను క్రమశిక్షణతో నిర్వహించడం విశేషంగా నిలిచిందన్నారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## పెద్ది స్వప్నను పరామర్శించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి**



**నల్లబెల్లి, 1 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం నల్లబెల్లిలోని వారి స్వగృహానికి వెళ్లిన ఆమె, పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి సతీమణి పెద్ది స్వప్నతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ విషాదాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజాసేవలో అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ, నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేసిన నాయకుడిగా పెద్ది సుదర్శన్ రెడ్డి ఎప్పటికీ గుర్తుండిపోతారని డా. కడియం కావ్య పేర్కొన్నారు. ఆయన మరణం ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయ, సామాజిక రంగాలకు తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొని పెద్ది సుదర్శన్ రెడ్డికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ఆపరేషన్ ముస్కాన్-12లో 6,307 మంది చిన్నారుల రక్షణ

**5,041 మంది బాల కార్మికులకు విముక్తి.**
**1,705 కేసులు నమోదు. 1,710 మంది అరెస్టు**

**హైదరాబాద్, 1 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**



బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా నిర్మూలన లక్ష్యంగా తెలంగాణ పోలీసులు చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్-12 రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా ముగిసింది. జూలై 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో మొత్తం 6,307 మంది చిన్నారులను రక్షించినట్లు మహిళా భద్రత విభాగం డైరెక్టర్ చారు సిన్హా తెలిపారు. మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో పోలీసులు, మహిళా--శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, వైద్య శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, జిల్లా బాలల సంరక్షణ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో ఈ ఆపరేషన్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 124 సబ్‌డివిజన్‌లలో 620 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ముందస్తు శిక్షణ అనంతరం రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, దేవాలయాలు, ఇటుక బట్టీలు, మెకానిక్ షాపులు, నిర్మాణ ప్రదేశాలు, టీ దుకాణాలు తదితర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. రక్షించిన 6,307 మంది చిన్నారుల్లో 5,892 మంది బాలురు, 415 మంది బాలికలు ఉన్నారు. వీరిలో 3,447 మంది తెలంగాణకు చెందినవారు, 2,860 మంది ఇతర రాష్ట్రాలు, నేపాల్‌కు చెందినవారు. మొత్తం 5,041 మంది బాల కార్మికులు, ఒక బానిస కార్మికుడు, 647 మంది వీధి బాలలు, 43 మంది భిక్షాటన చేస్తున్న చిన్నారులు, 11 మంది ఇంటి నుంచి పారిపోయిన చిన్నారులు కాగా, డ్రాప్‌అవుట్లు, బాల్య వివాహాలు, అక్రమ దత్తత వంటి ఇతర విభాగాల్లో 563 మంది చిన్నారులను గుర్తించి రక్షించారు. ఆపరేషన్ సందర్భంగా 1,705 కేసులు నమోదు చేసి 1,710 మందిని అరెస్టు చేశారు. ఈ కేసుల ద్వారా 1,989 మంది చిన్నారులను రక్షించారు. కార్మిక శాఖ 1,381 తనిఖీ నివేదికలు జారీ చేయడంతో పాటు కనీస వేతనాల చట్టం కింద రూ.37.95 లక్షల జరిమానాలు విధించింది. రక్షించిన చిన్నారుల్లో 5,737 మందిని వారి కుటుంబాలకు అప్పగించగా, 570 మందిని బాలల సంరక్షణ కేంద్రాలకు తరలించారు. హోటళ్లు, ధాబాలు, వీధి వ్యాపారాలు, నిర్మాణ రంగం, కిరాణా దుకాణాలు, ఆటోమొబైల్ రంగం, మాంసం దుకాణాలు, ఇటుక బట్టీలు, వెల్డింగ్ వర్క్‌షాపులు, బేకరీలు, పాదరక్షల దుకాణాలు, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ షాపులతో పాటు పాఠశాల మానేసిన చిన్నారులను కూడా గుర్తించి రక్షించినట్లు చారు సిన్హా తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా, బానిస కార్మిక వ్యవస్థ నిర్మూలనలో అన్ని శాఖల సమన్వయంతో తెలంగాణ మరోసారి దేశానికి ఆదర్శంగా నిలిచిందని చారు సిన్హా పేర్కొన్నారు.

# సంగెం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత





**ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి.. కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి: సీపీ**

**సంగెం, 1 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్ )**

వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత (ఐపీఎస్) శనివారం ఈస్ట్ జోన్ పరిధిలోని సంగెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిపాలన, రికార్డుల నిర్వహణ, నేరాల దర్యాప్తు, ప్రజలకు అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సంగెం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామునూర్ ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్, సంగెం ఎస్ఐ వంశీకృష్ణ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన సీపీ, స్టేషన్ ఆవరణలో మామిడి మొక్కను నాటి హరితహారం కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు. తదుపరి పోలీస్ స్టేషన్ ఆవరణ, స్టోర్‌రూమ్‌లు, మాల్ఖానా, స్టేషన్ రికార్డులు, కేసు ఫైళ్లు, ఆయుధాగారం, పోలీసు సిబ్బందికి వ్యక్తిగతంగా మంజూరు చేసిన కిట్లు, ఇతర పరిపాలనా విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమై శాఖాపరమైన సమస్యలు, విధి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాల స్వభావం, పెండింగ్ కేసుల విచారణ, దర్యాప్తు పురోగతి, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలు, విజిబుల్ పోలీసింగ్, రాత్రి పెట్రోలింగ్, శాంతిభద్రతల నిర్వహణ వంటి అంశాలపై సంగెం ఎస్ఐ వంశీకృష్ణ నుంచి వివరాలను సీపీ సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారు, బాధితుడితో మర్యాదపూర్వకంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. ప్రజల సమస్యలను పూర్తిగా తెలుసుకుని చట్టబద్ధంగా, వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం, భద్రత, భరోసా పెంపొందేలా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని, విధి నిర్వహణలో ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతికి తావు లేకుండా పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేయాలని సిబ్బందికి సూచించారు. డయల్-100కు వచ్చే అత్యవసర కాల్స్‌పై వెంటనే స్పందించి సంఘటన స్థలానికి సకాలంలో చేరుకుని బాధితులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. పోలీసు సిబ్బందికి విధి నిర్వహణలో లేదా వ్యక్తిగతంగా ఎదురయ్యే సమస్యలను నిర్భయంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని పోలీస్ కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామునూర్ ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్, సంగెం ఎస్ఐ వంశీకృష్ణ, పర్వతగిరి ఎస్ఐ ప్రవీణ్, ఐనవోలు ఎస్ఐ అశోక్ కుమార్‌తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆపరేషన్ ముస్కాన్-12 ద్వారా 314 మంది చిన్నారులకు విముక్తి

**55 కేసులు నమోదు..**
**బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు**
**వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత**

**వరంగల్, 1 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జూలై 1 నుంచి జూలై 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్-12 ద్వారా మొత్తం 314 మంది చిన్నారులను బాల కార్మిక వ్యవస్థ నుంచి రక్షించినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. రక్షించబడిన చిన్నారుల్లో 269 మంది బాలురు, 45 మంది బాలికలు ఉన్నారు. వీరిలో 226 మంది బాల కార్మికులుగా పనిచేస్తుండగా, 85 మంది పాఠశాల మానేసిన విద్యార్థులను గుర్తించి రక్షించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా కమిషనరేట్ పరిధిలోని పారిశ్రామిక ప్రాంతాలు, దుకాణాలు, హోటళ్లు, ఇటుక బట్టీలు, ఇతర ప్రమాదకర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఇందుకోసం తొమ్మిది సబ్‌డివిజన్లలో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి, ఎస్ఐల ఆధ్వర్యంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్, కార్మిక శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. రక్షించిన చిన్నారులను సంబంధిత చైల్డ్ వెల్ఫేర్ కమిటీల ముందు హాజరుపరిచి, వారికి మరియు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి అప్పగించారు. రక్షించబడిన వారిలో బీహార్, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అస్సాం రాష్ట్రాలకు చెందిన 130 మంది చిన్నారులు ఉన్నట్లు కమిషనర్ తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించి చిన్నారులతో పనులు చేయించిన యజమానులపై 55 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగా, కార్మిక శాఖ ద్వారా 92 తనిఖీ నివేదికలు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే వివిధ పోలీస్ స్టేషన్ల జనరల్ డైరీల్లో 118 మంది చిన్నారుల వివరాలు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ, "పిల్లలు బడిలో ఉండాలి.. పనిలో కాదు. బాల్యాన్ని కాపాడటమే ఆపరేషన్ ముస్కాన్ ప్రధాన లక్ష్యం. బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. చిన్నారుల హక్కుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో పాటు మహిళా, శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, కార్మిక శాఖ, విద్యాశాఖ అధికారులు, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధులు, షేర్, స్కోప్, ఎఫ్ఎంఎం ఎస్ఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.




# విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబానికి రూ.3.16 లక్షల ఆర్థిక సాయం

**చెక్కు అందజేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**హనుమకొండ, 1 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 51వ డివిజన్ జూలైవాడకు చెందిన నేరెళ్ల నవీన్--ప్రియాంక దంపతుల కుమారుడు నేరెళ్ల శ్రేయాన్ భార్గవ్ ఇటీవల విద్యుత్ ప్రమాదంలో గాయపడిన ఘటనపై వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పందించారు. విద్యుత్ శాఖ అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడి బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే చొరవతో విద్యుత్ శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.3,16,000ల ఆర్థిక సాయాన్ని మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విద్యుత్ శాఖ అధికారులతో కలిసి బాధిత కుటుంబాన్ని వారి నివాసంలో పరామర్శించి, రూ.3.16 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రమాద బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఆపద ఎదురైనా వెంటనే స్పందించి సహాయం అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నెక్కొండ కవిత



కిషన్, డివిజన్ ఇన్‌చార్జ్ కౌటిల్ రెడ్డి, నాయకులు మానస రామ్ ప్రసాద్, నేపాల్ రెడ్డి, రాజ్ కుమార్, విద్యుత్ శాఖ డీఈ సాంబారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 7న బెంగళూరులో జరిగే అఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలి

**కులగణన, బీసీల రాజ్యాంగ హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమిద్దాం**
**ఆరేగంటి నాగరాజు గౌడ్**



**కాకతీయ యూనివర్సిటీ, 1 ఆగస్టు 2026( జై భీమ్ న్యూస్)**

ఆగస్టు 7న బెంగళూరులో నిర్వహించనున్న అఖిల భారత జాతీయ ఓబీసీ 11వ మహాసభను బీసీ విద్యార్థులు, యువత, మేధావులు, ఉద్యోగులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ చైర్మన్, బీసీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆరేగంటి నాగరాజు గౌడ్ పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట నిర్వహించిన అఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభ వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాజీ ప్రధాని వి.పి. సింగ్ 1990 ఆగస్టు 7న మండల్ కమిషన్ సిఫారసుల అమలును ప్రకటించిన చారిత్రాత్మక దినాన్ని పురస్కరించుకొని, జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో బెంగళూరులోని జ్ఞానజ్యోతి ఆడిటోరియంలో అఖిల భారత జాతీయ ఓబీసీ 11వ మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశ జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో వాటా కల్పించాలంటే కులగణన అత్యవసరమని నాగరాజు గౌడ్ పేర్కొన్నారు. స్వాతంత్ర్యానికి ముందు 1931లో బ్రిటిష్ ప్రభుత్వం చివరిసారిగా కులాల వారీ జనాభా లెక్కలు సేకరించిందని, స్వాతంత్ర్యం అనంతరం ఇప్పటి వరకు సమగ్ర కులగణన జరగలేదని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు, ఉత్పత్తి రంగాలకు, శ్రమాధారిత వృత్తులకు బీసీలే వెన్నెముక అని ఆయన వ్యాఖ్యానించారు. బీసీల అభివృద్ధినే దేశ అభివృద్ధిగా కేంద్ర ప్రభుత్వం చూడాలని కోరారు. బీసీల జనాభాకు అనుగుణంగా రాజ్యాంగబద్ధ హక్కులు, రిజర్వేషన్లు, అభివృద్ధి అవకాశాలు కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పరిరక్షణ, కులగణన, సామాజిక న్యాయం వంటి అంశాలపై బెంగళూరులో జరిగే మహాసభలో కీలక చర్చలు జరుగనున్నాయని పేర్కొంటూ, తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న బీసీ సంఘాలు, విద్యార్థులు, యువజనులు, ఉద్యోగులు, మేధావులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు శ్రీ సాయి, కద్రు, రాజశేఖర్, సాయిరామ్, శ్రావణ్, లక్ష్మణ్, మహేష్, నాగరాజు, నవీన్, రమేష్, యేసుబాబు తదితరులు పాల్గొన్నారు.

# పరకాలలో భవన నిర్మాణ కార్మికుల సమ్మె విజయవంతం

**కొత్త కూలీ రేట్లపై ఏకాభిప్రాయం..**
**సహకరించిన ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులకు కార్మికుల కృతజ్ఞతలు**



**పరకాల, 1ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

పరకాల పట్టణంలో భవన నిర్మాణ కార్మికులు కూలీ రేట్ల సవరణ కోసం జూలై 26 నుంచి ఆగస్టు 1 వరకు చేపట్టిన సమ్మె విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు, గృహ యజమానులు, కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. సమ్మె కాలంలో ప్రజల నుంచి విశేష మద్దతు లభించిందని సంఘం నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సూచనల మేరకు సమ్మెను పూర్తిగా శాంతియుత వాతావరణంలో నిర్వహించినట్లు తెలిపారు. సమ్మె విజయవంతం కావడానికి రెవెన్యూ, పోలీసు, కార్మిక శాఖ అధికారులతో పాటు ఆర్డీవో, తహసీల్దార్ (ఎమ్మార్వో), లేబర్ ఆఫీసర్, మీడియా ప్రతినిధులు అందించిన సహకారానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. సంఘం అధ్యక్షుడు పసుల అన్నస్వామి సమక్షంలో భవన నిర్మాణ పనులకు సంబంధించి కొత్త కూలీ రేట్లపై నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఇందిరమ్మ గృహాల నిర్మాణంలో 500 నుంచి 1000 చదరపు అడుగుల విస్తీర్ణం వరకు స్లాబ్ పనులకు గుత్త పద్ధతిలో రూ.3.80 లక్షలు నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే 1100 చదరపు అడుగులకు పైబడిన వ్యక్తిగత గృహాల నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.360 చొప్పున కూలీ రేటు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక ఎలివేషన్, డిజైన్ పనులకు నిర్మాణ నమూనాను బట్టి చదరపు అడుగుకు రూ.150 నుంచి రూ.250 వరకు అదనపు చార్జీ వసూలు చేయనున్నట్లు తెలిపారు. బెడ్, పుట్టింగ్, స్లాబ్ పనులకు అవసరమైన మిక్సర్ (మిల్లర్) అద్దెను ఇంటి యజమానులే భరించాలని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు వెల్లడించారు. కొత్త రేట్లు కార్మికుల శ్రమకు తగిన గౌరవం కల్పించడంతో పాటు నిర్మాణ రంగంలో సమతుల్యతను తీసుకురావడానికి దోహదపడతాయని సంఘం నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పసుల అన్నస్వామి, ప్రధాన కార్యదర్శి తాడిశెట్టి మహేందర్, ఉపాధ్యక్షుడు బొచ్చు రమేష్, బొట్ల జయపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ బాలాజీ, వేణుగోపాల చారి, ఎంజాల రాజు, వావిలాల పురుషోత్తం, సాదు పాణి, అడప కుమార్, బొచ్చు రఘు, చందర్, రాసమల్ల శంకర్, బొట్ల ఆనందం, గూడెళ్ల పైడి, ఇనుగాల సాంబయ్యతో పాటు పెద్ద సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# అన్నారం దర్గాలో అసలేం జరుగుతోంది..?

**భక్తి పేరుతో వసూళ్ల దందా సాగుతోందా..?**
**రూ.60 అధికారిక రుసుమేనా..? లేక భక్తుల నుంచి మరింత డబ్బు వసూలు చేస్తున్నారా..?**
**ఎవరి అండతో ఈ వ్యవహారం కొనసాగుతోంది..?**
**భక్తుల విశ్వాసాన్ని కోల్పోయేలా చేస్తున్నది ఎవరు..?**
**వరుసగా వెలుగులోకి వస్తున్న కథనాలు... అధికారుల మౌనం వెనుక మర్మమేంటి..?**



**జై భీమ్ న్యూస్ పర్వతగిరి ఆగస్టు 1**

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రమైన అన్నారం దర్గాలో జరుగుతున్న తలనీలాల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భక్తులు చేస్తున్న ఆరోపణలు, వెలుగులోకి వచ్చిన పలు కథనాలు, స్థానికుల ఆవేదన ఒకే దిశగా వేలెత్తి చూపుతున్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారుల నుంచి ఇప్పటివరకు స్పష్టమైన స్పందన లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దర్గాకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి వస్తుంటారు. తలనీలాలు సమర్పించడం అక్కడ ప్రధాన ఆచారంగా కొనసాగుతోంది. అయితే, ఈ సేవల పేరుతో భక్తుల నుంచి అధికారికంగా నిర్ణయించిన రుసుముకంటే ఎక్కువ మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బు చెల్లిస్తేనే త్వరగా సేవలు అందుతున్నాయని, లేకుంటే గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని కొందరు భక్తులు చెబుతున్నారు.

**రూ.60 మాత్రమేనా...? లేక అంతకంటే ఎక్కువ వసూలు చేస్తున్నారా..?**

క్షౌర సేవలకు ఒక అధికారిక రుసుము ఉన్నప్పటికీ, కొందరు భక్తులు అదనపు నగదు చెల్లించాల్సి వస్తోందని ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలు నిజమైతే ఆ డబ్బు ప్రభుత్వ ఖాతాలోకి వెళ్తోందా? లేక మరెవరి చేతుల్లోకి చేరుతోందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**క్షౌర సేవల్లో పారదర్శకత ఎక్కడ..?**

సేవలకు సంబంధించిన రుసుములు, రసీదు విధానం, పర్యవేక్షణ వ్యవస్థ భక్తులకు స్పష్టంగా కనిపించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ప్రస్తుతం పారదర్శకత కనిపించడం లేదనే విమర్శలు ఉన్నాయి. రుసుము వివరాలు బహిరంగంగా ప్రదర్శిస్తున్నారా? రసీదులు తప్పనిసరిగా ఇస్తున్నారా? అనే ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది.

**భక్తి... లేక బలవంతపు వసూళ్లా..?**

భక్తి అనేది విశ్వాసానికి ప్రతీక. కానీ అదే విశ్వాసాన్ని కొందరు ఆర్థిక లాభాల కోసం ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. పేదలు, రైతులు, కూలీలు అప్పులు చేసి మొక్కులు తీర్చుకోవడానికి వస్తే, అక్కడ కూడా అదనపు భారం మోపుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

**ఎవరి అండతో ఈ వ్యవహారం కొనసాగుతోంది..?**

ఇప్పటికే పలు మార్లు ఈ అంశంపై కథనాలు వెలుగులోకి వచ్చినప్పటికీ గట్టి చర్యలు కనిపించకపోవడంతో ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు నిజమైతే అవి ఎవరి అండతో కొనసాగుతున్నాయి? బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**అధికారుల మౌనం ఎందుకు..?**

ఆరోపణలు వస్తే వాటిని పరిశీలించి నిజానిజాలు వెల్లడించడం సంబంధిత అధికారుల బాధ్యత. ఆరోపణలు అసత్యమైతే ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అయితే ఇప్పటివరకు స్పష్టమైన స్పందన లేకపోవడం ప్రజల్లో మరింత అనుమానాలకు దారితీస్తోంది.

**భక్తుల విశ్వాసాన్ని కోల్పోయే పరిస్థితి ఎందుకు..?**

దైవ దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడు ప్రశాంతంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా మొక్కు తీర్చుకుని వెళ్లాలని కోరుకుంటాడు. అలాంటి చోట డబ్బుల కోసం ఇబ్బందులు ఎదురవుతున్నాయనే భావన ఏర్పడితే దర్గాపై భక్తుల విశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**జై భీమ్ న్యూస్ ప్రశ్నిస్తోంది...**

అధికారిక రుసుము రూ.60 మాత్రమేనా? లేక అంతకంటే ఎక్కువ వసూలు చేస్తున్నారా?

క్షౌర సేవల్లో పారదర్శకత ఎందుకు కనిపించడం లేదు?

అదనంగా వసూలు చేస్తున్న డబ్బు ఎక్కడికి వెళ్తోంది?

వరుసగా వెలుగులోకి వస్తున్న కథనాలపై అధికారులు ఎందుకు స్పందించడం లేదు?

ఎవరి అండతో ఈ వ్యవహారం కొనసాగుతోంది?

భక్తుల విశ్వాసాన్ని కాపాడే బాధ్యత ఎవరిది?

**జై భీమ్ న్యూస్ డిమాండ్**

అన్నారం దర్గాలో తలనీలాల సేవలు, రుసుముల వసూళ్లు, క్షౌర సేవల నిర్వహణపై స్వతంత్రంగా, పారదర్శకంగా విచారణ నిర్వహించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలి. అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందేలా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని జై భీమ్ న్యూస్ డిమాండ్ చేస్తోంది.

# ఎస్ఆర్ఆర్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో అవయవదానంపై అవగాహన సదస్సు





**“అవయవదానం - మహాదానం”పై విద్యార్థులకు చైతన్యం.. యువత సేవాభావంతో ముందుకు రావాలని పిలుపు**

**హనుమకొండ, 1 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా ఎల్లాతుర్తి మండలం వల్భాపూర్‌లోని ఎస్ఆర్ఆర్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో “అవయవదానం -- మహాదానం” అనే అంశంపై అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ & చైర్మన్ ప్రొఫెసర్ బి. అగయ్య గౌడ్ మార్గదర్శకత్వంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్, కామారెడ్డి దేవరశెట్టి రజిత హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆమె సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ మరియు అఖిల భారత అవయవ శరీర దాతల సంఘం తరఫున పాల్గొని అవయవదానంపై విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. తన ప్రసంగంలో అవయవదానం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, మరణానంతరం కూడా అనేక మంది ప్రాణాలను కాపాడే అత్యున్నత మానవతా సేవ అవయవదానమని పేర్కొన్నారు. సమాజంలో ఉన్న అపోహలను తొలగించి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా అవయవదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె పలు ముఖ్యమైన అంశాలను వివరించారు. ఒక అవయవదాత ద్వారా ఎనిమిది మంది వరకు ప్రాణాలను కాపాడవచ్చని, నేత్రదానం ద్వారా ఇద్దరికి చూపును ప్రసాదించవచ్చని తెలిపారు. మెదడు మరణం (బ్రెయిన్ డెత్) అనంతరం కూడా చట్టబద్ధంగా అవయవాలను దానం చేయవచ్చని వివరించారు. అవయవదానం పూర్తిగా స్వచ్ఛందమైన మానవతా సేవ అని, దీనికి కుటుంబ సభ్యుల అవగాహన, సమ్మతి ఎంతో అవసరమని చెప్పారు. అలాగే రక్తదానం, నేత్రదానం, అవయవదానం వంటి సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలని, ఇటువంటి సేవల ద్వారా సమాజంలో మానవత్వం, సేవాభావం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ & చైర్మన్ ప్రొఫెసర్ బి. అగయ్య గౌడ్ మాట్లాడుతూ, ఫార్మసీ విద్యార్థులు ఔషధ విజ్ఞానంతో పాటు సమాజానికి సేవ చేయాలనే దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఆరోగ్య అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ సామాజిక బాధ్యతను నిర్వర్తించాలని, ఇలాంటి కార్యక్రమాలను కళాశాల తరచూ నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పరమేశ్వర్, డాక్టర్ దిలీప్, డాక్టర్ కరుణాకర్ రెడ్డి, డాక్టర్ స్వాతితో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు అవయవదానంపై అవగాహన ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ముఖ్య అతిథి దేవరశెట్టి రజితను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# జై భీమ్ న్యూస్ - స్పెషల్ ఫోకస్

**రోడ్లపై రక్తపాతం... ఆగేదెప్పుడు?**
**మద్యం, డ్రగ్స్, అతివేగం, నిర్లక్ష్యం... క్షణిక తప్పిదం - ఎన్నో కుటుంబాలకు జీవితాంతం శోకం**

**జై భీమ్ న్యూస్ ప్రత్యేక ప్రతినిధి**

ప్రతి ఉదయం ఇంటి నుంచి క్షేమంగా బయలుదేరిన వ్యక్తి సాయంత్రం సురక్షితంగా తిరిగి వస్తాడనే నమ్మకంతో కుటుంబ సభ్యులు ఎదురుచూస్తుంటారు. కానీ ఇటీవలి కాలంలో రాష్ట్రంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఆ నమ్మకాన్నే ప్రశ్నిస్తున్నాయి. ఒక క్షణం నిర్లక్ష్యం... ఒక తప్పు నిర్ణయం... ఒక క్షణిక మత్తు... ఇవే ఇప్పుడు వేలాది కుటుంబాల్లో తీరని విషాదానికి కారణమవుతున్నాయి. రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయేది ఒక్క వ్యక్తే కావచ్చు. కానీ ఆ బాధను జీవితాంతం మోసేది ఆ కుటుంబం మొత్తం. తల్లిదండ్రులు తమ బిడ్డను, భార్య తన భర్తను, పిల్లలు తమ తండ్రిని, కుటుంబాలు తమ ఆధారాన్ని కోల్పోతున్నాయి. ప్రతి ప్రమాదం వెనుక ఒక కుటుంబం కన్నీటి కథ దాగి ఉంది.

**విధి కాదు... ఎక్కువ ప్రమాదాలకు కారణం మానవ నిర్లక్ష్యమే**

రోడ్డు ప్రమాదాలను “విధి” పేరుతో సరిపెట్టే పరిస్థితి దాటిపోయిందని నిపుణులు చెబుతున్నారు. ఎక్కువ శాతం ప్రమాదాలు మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని వారు స్పష్టం చేస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, అతివేగంగా వాహనాలు నడపడం, మద్యం లేదా డ్రగ్స్ మత్తులో డ్రైవింగ్ చేయడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ లేదా చూస్తూ వాహనం నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, సీటుబెల్ట్ పెట్టుకోకపోవడం వంటి నిర్లక్ష్యాలే ప్రాణాంతకంగా మారుతున్నాయి. కొంతమంది వేగాన్ని గొప్పతనంగా భావిస్తున్నారు. కానీ అదే వేగం ఒక్క క్షణంలో జీవితాన్ని ముగించే ప్రమాదంగా మారుతోంది.

**మద్యం... డ్రగ్స్... క్షణిక మత్తు -- జీవితాంతం విషాదం**

రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాల్లో మద్యం, డ్రగ్స్ మత్తులో డ్రైవింగ్ ఒకటి. మత్తులో ఉన్న వ్యక్తి తన వాహనంపై నియంత్రణ కోల్పోవడమే కాకుండా, ఎదురుగా వచ్చే అమాయకుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెడుతున్నాడు. ఒక్క గ్లాసు మద్యం లేదా ఒక మత్తు పదార్థం కోసం తీసుకున్న నిర్ణయం... ఎన్నో కుటుంబాలకు తీరని గాయాన్ని మిగులుస్తోంది. ఇటీవలి కాలంలో మద్యం లేదా డ్రగ్స్ మత్తులో జరిగిన ప్రమాదాల్లో యువతతో పాటు చిన్నారులు, మహిళలు, వృద్ధులు కూడా ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు వరుసగా వెలుగుచూస్తున్నాయి. మరికొందరు శాశ్వత వికలాంగులుగా మారి జీవితాంతం బాధ అనుభవిస్తున్నారు. వాహనం నడపడం హక్కు మాత్రమే కాదు... అది గొప్ప బాధ్యత కూడా. మత్తులో స్టీరింగ్ పట్టడం అంటే కేవలం తన ప్రాణాన్నే కాదు, రోడ్డు మీద ప్రయాణించే ప్రతి ఒక్కరి ప్రాణాలను పణంగా పెట్టడమే.

**అతివేగం... మరణానికి మరో పేరు**

“ఇంకొంచెం స్పీడ్ పెంచితే ఏమవుతుంది?” అనే నిర్లక్ష్య ఆలోచనే అనేక కుటుంబాలను రోడ్డున పడేస్తోంది. వేగం పెరిగే కొద్దీ ప్రమాద తీవ్రత కూడా పెరుగుతుంది. క్షణాల్లో బ్రేక్ వేయలేని పరిస్థితి, నియంత్రణ కోల్పోయిన వాహనం, ఎదురుగా వస్తున్న అమాయకులు... చివరికి విషాదమే మిగులుతోంది.

**మొబైల్ ఫోన్... మరో ప్రమాదకర అలవాటు**

డ్రైవింగ్ చేస్తూనే మొబైల్‌లో మాట్లాడటం, మెసేజ్‌లు చూడటం, వీడియోలు చూడటం వంటి అలవాట్లు ప్రమాదాలను మరింత పెంచుతున్నాయి. కొన్ని సెకన్ల పాటు రోడ్డు నుంచి దృష్టి మళ్లినా అది ప్రాణాలు తీసే ప్రమాదానికి దారితీస్తోంది.

**హెల్మెట్, సీటుబెల్ట్... చిన్న జాగ్రత్త -- పెద్ద రక్షణ**

హెల్మెట్ ధరించకపోవడం, సీటుబెల్ట్ పెట్టుకోకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ రెండు చిన్న భద్రతా చర్యలు వేలాది ప్రాణాలను కాపాడగలవని నిపుణులు చెబుతున్నప్పటికీ, చాలామంది ఇప్పటికీ వాటిని నిర్లక్ష్యం చేస్తున్నారు.

**రహదారుల పరిస్థితి కూడా ఆందోళనకరం**

రోడ్లలో గుంతలు, హెచ్చరిక బోర్డుల కొరత, రాత్రివేళల్లో వీధి దీపాలు లేకపోవడం, ప్రమాదకర మలుపుల వద్ద భద్రతా ఏర్పాట్లు లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని వాహనదారులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి వెంటనే శాశ్వత చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రాణం పోయాక పశ్చాత్తాపం ఎందుకు? ముందే జాగ్రత్త ఎందుకు కాదు? ప్రమాదం జరిగిన తర్వాత సంతాపాలు ప్రకటించడం, పరిహారాలు ఇవ్వడం కంటే ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంపైనే ప్రభుత్వ యంత్రాంగం, సంబంధిత శాఖలు మరింత దృష్టి పెట్టాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రతి ప్రమాదం తర్వాత విచారణలు జరగడం కాదు... ప్రమాదం జరగకుండా చూడటమే అసలు విజయమని నిపుణులు అంటున్నారు.

**చట్టం భయం కనిపిస్తేనే నిర్లక్ష్యానికి బ్రేక్?**

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించడం మాత్రమే కాకుండా, పదేపదే నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మద్యం సేవించి డ్రైవింగ్, డ్రగ్స్ మత్తులో డ్రైవింగ్, అతివేగం, రాంగ్ రూట్, సిగ్నల్ జంపింగ్ వంటి ఉల్లంఘనలపై రాజీ లేకుండా చట్టాన్ని అమలు చేయాలని సూచిస్తున్నారు.

**పోలీసు వ్యవస్థలో మరింత పర్యవేక్షణ అవసరం**

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు పండుగలకే పరిమితం కాకుండా ఏడాది పొడవునా నిర్వహించాలి. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో శాశ్వత నిఘా, స్పీడ్ గన్స్, సీసీ కెమెరాలు, ప్రత్యేక ట్రాఫిక్ బృందాలు ఏర్పాటు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. చట్టం భయంతో కాదు... ప్రాణాల విలువ తెలుసుకుని ప్రజలు నిబంధనలు పాటించే సంస్కృతి ఏర్పడాల్సిన అవసరం ఉంది.

**ప్రజల్లో బాధ్యత పెరగకపోతే మార్పు కష్టం**

రోడ్డు ప్రమాదాలకు ప్రభుత్వం లేదా పోలీసులు మాత్రమే కారణమని చెప్పడం సరైంది కాదు. ప్రజలు కూడా తమ బాధ్యతను గుర్తించాలి. హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ పెట్టుకోవడం, మద్యం లేదా డ్రగ్స్ సేవించిన తర్వాత వాహనం నడపకపోవడం, వేగాన్ని నియంత్రించడం, మొబైల్ ఫోన్‌ను పక్కన పెట్టడం వంటి చిన్న జాగ్రత్తలు ఎన్నో కుటుంబాలను కాపాడగలవు. కుటుంబ సభ్యులు కూడా మద్యం సేవించిన వ్యక్తిని వాహనం నడపనివ్వకుండా అడ్డుకోవాలి. అది ఒక కుటుంబాన్ని మాత్రమే కాదు... మరెన్నో కుటుంబాలను కాపాడినట్లే.

**కఠిన చట్టాలే పరిష్కారమా?**

పదేపదే మద్యం లేదా డ్రగ్స్ మత్తులో డ్రైవింగ్ చేసే వారి లైసెన్సులను రద్దు చేయడం, అతివేగంతో వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం, మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**రోడ్డు భద్రత... అందరి బాధ్యత**

రోడ్డు భద్రత అనేది ఒక్క ప్రభుత్వ బాధ్యత కాదు... ఒక్క పోలీసుల బాధ్యత కూడా కాదు. ప్రభుత్వం నాణ్యమైన రహదారులు నిర్మించాలి. పోలీసులు చట్టాన్ని రాజీ లేకుండా అమలు చేయాలి. ప్రజలు స్వచ్ఛందంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. ఈ మూడు కలిసి పనిచేసినప్పుడే రోడ్లపై రక్తపాతం తగ్గే అవకాశం ఉంటుంది.

**జై భీమ్ న్యూస్ ప్రశ్నిస్తోంది...**

ప్రాణాలు కాపాడే చట్టాలు ఉన్నప్పుడు... వాటి అమలులో మరింత కఠినత్వం ఎందుకు ఉండకూడదు? మద్యం, డ్రగ్స్ మత్తులో డ్రైవింగ్ చేసే వారిపై రాజీలేని చర్యలు ఎప్పుడు? ప్రతి ప్రమాదం తర్వాత కన్నీళ్లు కార్చడం కంటే... ప్రతి ప్రమాదాన్ని ముందే అడ్డుకునే వ్యవస్థ ఎప్పుడు? రోడ్డు భద్రతను హక్కుగా మాత్రమే కాకుండా బాధ్యతగా ప్రజలు ఎప్పుడు స్వీకరిస్తారు? - రఘు గొర్రెకుంట జై భీమ్ న్యూస్ రిపోర్టర్ పర్వతగిరి







# ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

**అక్రమాల బట్టబయలుకు ఫాస్ట్‌ట్రాక్ విచారణ**
**పేదల భూములు కాజేసిన వారిని వదిలిపెట్టం**
**నిషేధిత జాబితాలో కొత్తగా అంగుళం భూమి కూడా చేర్చలేదు**
**భూముల ధరల సవరణతో ఆదాయం 20శాతం వరకు పెరుగుదల**
**త్వరలో అసైన్డ్ భూములపై సమగ్ర విధాన నిర్ణయం**
**కేంద్రం నిధులు ఇవ్వకపోయినా ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు చెల్లిస్తాం**
**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్,ఆగస్ట్1(జై భీమ్ న్యూస్):**

ధరణి అక్రమాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ధరణి నుంచి భూభారతి వరకు లావాదేవీలపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. పేదల భూములను కాజేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. నిషేధిత జాబితాలో కొత్తగా అంగుళం భూమి కూడా చేర్చలేదన్నారు. మరోవైపు భూముల ధరల సవరణతో రిజిస్ట్రేషన్ల ఆదాయం 20శాతం వరకు పెరిగిందని పొంగులేటి తెలిపారు. సచివాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని పేదల భూములు, ప్రభుత్వ భూములను అక్రమంగా కాజేసిన వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి నుంచి భూభారతి వరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని ఫాస్ట్‌ట్రాక్ విధానంలో విచారిస్తున్నామని, అక్రమాలకు పాల్పడిన వారెవరైనా చట్టం ముందు నిలబెట్టడం ఖాయమని హెచ్చరించారు. ధరణి పోర్టల్‌ను అడ్డుగా చేసుకుని భారీ స్థాయిలో భూ అక్రమాలు, అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ భూముల బదిలీలు జరిగాయని అన్నారు. ప్రస్తుతం ప్రతి వ్యవహారాన్ని ఆధారాలతో సహా పరిశీలిస్తున్నామని, నిజాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు. అంతేగాక ఎవరి హయాంలో ఎంత భూమి నిషేధిత జాబితాలో చేరిందో తేలుస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పుడు నిషేధిత జాబితాలో ఎంత భూమి ఉంది? ఆ భూములను ఎవరు, ఎప్పుడు, ఏ కారణాలతో చేర్చారు? తర్వాత ఎందుకు తొలగించారు? అనే ప్రతి అంశంపై సమగ్ర విచారణ జరుగుతోందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కూడా అదే స్థాయిలో పరిశీలిస్తున్నామని స్పష్టం చేశారు.కొత్తగా ఒక్క సెంటు భూమి కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు.



ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా అంగుళం భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ధరణి పోర్టల్‌లో ఉన్న జాబితానే కోర్టుకు సమర్పించామని, వివాదాలు లేని ప్రైవేట్ ఆస్తులు లేదా ప్లాట్లను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అసత్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే 276 గ్రామాల్లో సర్వే పూర్తైందని, ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయిస్తామని చెప్పారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, కేవలం రెండు శాతం మాత్రమే అభ్యంతరాలు వచ్చాయని వివరించారు. రాష్ట్రంలో సుమారు 85 వేల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని, వాటి విషయంలో సమగ్ర విధాన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని కోణాల్లో ప్రభుత్వం చర్చిస్తోందని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని, ఎవరికీ అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యవహరించే ప్రశ్నే లేదని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే ప్రతి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. క్యూర్ పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్‌ను చూసి బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. కొల్లూరులో గత ప్రభుత్వం నిర్మించిన 2బీహెచ్‌కే ఇళ్లలో వర్షం వస్తే నీళ్లు కారుతున్నాయని మీడియా దృష్టికి వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అది గత ప్రభుత్వ నాణ్యతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. అయినప్పటికీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ ఇళ్లను కూడా మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోయినా, లబ్దిదారులు ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే ÷నైల్ బిల్లులు చెల్లిస్తుందని మంత్రి ప్రకటించారు. భూముల మార్కెట్ విలువల సవరణ తర్వాత ప్రభుత్వం అంచనా వేసిన దానికంటే 10 నుంచి 20 శాతం వరకు అధిక ఆదాయం వచ్చిందని మంత్రి తెలిపారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్స్ శాఖ ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు వార్షిక ఆదాయం సుమారు రూ.13 వేల కోట్లు ఉండగా, గత ఏడాది అది రూ.15 వేల కోట్లకు చేరిందని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.18 వేల కోట్లకు చేరుకునే అవకాశం ఉందని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని మంత్రి పొంగులేటి తెలిపారు.

---

## స్వేచ్ఛ అంటే ఇష్టం వచ్చినట్లు చేయడం కాదు

**సమాజం, దేశం పట్ల బాధ్యతలు కూడా ముఖ్యమే**
**చట్టాన్ని గౌరవించడం పౌరుల ప్రాథమిక విధి**
**జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సంచలన వ్యాఖ్య**
**దోవల్‌కు అమిత్ షా చేతుల మీదుగా తిలక్ జాతీయ పురస్కారం అందచేత**

**ముంబై,ఆగస్ట్1(జై భీమ్ న్యూస్):**

ఇటీవల దేశంలో యువత చేపట్టిన నిరసనలపై జాతీయ భద్రతా సలహాదారు, ఇండియన్ జేమ్స్ బాండ్ అజిత్ దోవల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. స్వేచ్ఛ అంటే ఇష్టమొచ్చింది చేయడం కాదని యువతకు చురకలటించారు. స్వేచ్ఛతో పాటు సమాజం, దేశం పట్ల బాధ్యతలు కూడా ఉంటాయని యువత గుర్తుంచుకోవాలని హితవు పలికారు. స్వేచ్ఛ, నిరసన తెలిపే హక్కు చట్టబద్ధమైన పరిధిలోనే ఉండాలని నొక్కి చెప్పారు. ప్రజాస్వామ్యంలో శాంతిభద్రతలను కాపాడటం, చట్టాన్ని గౌరవించడం పౌరుల ప్రాథమిక విధి అని గుర్తు చేశారు. స్వేచ్ఛను ఇష్టానుసారంగా ఏమైనా చేసే అనియంత్రిత హక్కుగా భావించవద్దని యువతను హెచ్చరించారు. దేశ భద్రత, ఇంటెలిజెన్స్ రంగాలలో చేసిన అసమాన సేవలకు గాను అజిత్ దోవల్ ప్రతిష్టాత్మక లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం మహారాష్ట్రలోని పుణెలో జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా దోవల్ ఈ అవార్డు అందుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు లోక్‌మాన్య బాలగంగాధర్ తిలక్ 106వ వర్ధంతి సందర్భంగా లోక్‌మాన్య తిలక్ స్మారక్ ట్రస్ట్ ఈ పురస్కారాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాట సమయంలో ఉద్యమకారులు చేసిన త్యాగాలను యువ భారతీయులు స్మరించుకోవాలని సూచించారు. భారతదేశ జాతీయ చైతన్యాన్ని తీర్చిదిద్దడంలో తిలక్ పోషించిన పాత్ర.. ఆయన జీవితం నుంచి యువతరం స్ఫూర్తి పొందాలని కోరారు. నీట్ యూజీ 2026 క్వశ్చన్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా యువత పెద్ద ఎత్తున నిరసనలు తెలిపిన విషయం తెలిసిందే. నీట్ పేపర్ లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చలో పార్లమెంట్?కు పిలుపునిచ్చింది. అయితే, ఈ చలో పార్లమెంట్ కార్యక్రమం తీవ్ర హింసాత్మకంగా మారింది. యువత నిరసనలను అణిచివేసేందుకు పోలీసులు దమనకాండ కొనసాగించారు. యువతపై లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్, పె÷-లలెట్ గన్స్ ఉపయోగించారు. కొన్ని చోట్ల పోలీసుల బలప్రయోగంపై యువత తిరగబడ్డారు. దీంతో సీజేపీ తలపెట్టిన చలో పార్లమెంట్ తీవ్ర హింసాత్మకంగా మారింది. విద్యార్థులపై పోలీసుల బలప్రయోగంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ప్రతిపక్షాలు కూడా విద్యార్థుల దాడిని తీవ్రంగా ఖండించాయి. యువత, ప్రతిపక్షాల నుంచి ఒత్తిడి పెరగడంతో ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో మరో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి తాత్కాలికంగా విద్యాశాఖ బాధ్యతలు చేపట్టారు.

---

## ఒక్కరోజులో రెండు లక్షలు దాటిన మీసేవ లావాదేవీలు

**తొలిసారి రికార్డు స్థాయిలో మీసేవ కార్యకలాపాలు**
**దేశంలోనే నెంబర్ వన్ గా మీసేవ ఆన్‌లైన్ ప్లాట్ ఫార్మ్**
**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**హైదరాబాద్,ఆగస్ట్1(జై భీమ్ న్యూస్):**



ప్రభుత్వ సేవలు, లావాదేవీలను ఆ÷-లనైన్ లో ఒకే వేదిక మీద అందిస్తోన్న మీసేవ మరొక రికార్డును నమోదు చేసింది. శుక్రవారం ఒక్క రోజే 2,20,172 లావాదేవీలు నమోదు అయ్యాయి. ఇలా ఒకే రోజు రికార్డు స్థాయిలో మీసేవ కార్యకలాపాలు జరిగాయని ఐటిశాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు వెల్లడించారు. మీసేవ డిజిటల్ ఎ÷-లాట్ ఫామ్ ను మరింతగా అభివృద్ధి చేయటం, సేవలను విస్తృత పరచటం, ఆమేరకు ప్రజల వాడకాన్ని ప్రోత్సహించటంలో ప్రజాప్రభుత్వం చొరవచూపిస్తోంది. దీంతో కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. రాష్ట్ర పౌరులకు వేగంగా, పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలను అందించేందుకు మీసేవ వేదికను ప్రభుత్వం నిరంతరం బలోపేతం చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఒక్క రోజులో రికార్డు స్థాయిలో ఎలాంటి అవాంతరాలు లేని లావాదేవీల ద్వారా దేశంలోనే నెంబర్ వన్ గవర్నమెంట్ ఆ÷-లనైన్ ఎ÷-లాట్ ఫార్మ్ గా మీ సేవ నిలిచిందని మంత్రి అన్నారు. రోజు సరాసరి 70 నుంచి 80 వేల కార్యకలాపాలు మీసేవ ద్వారా నమోదవుతాయి. శుక్రవారం ఒకే రోజులో 2.20 లక్షలకు పైగా లావాదేవీలు నమోదయ్యాయి. వీటిల్లో ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఫ్యామిలీ కార్డు, రవాణాశాఖ, ఆదాయ ధృవీకరణ పత్రాల అప్లికేషన్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఘనత తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ సేవల వ్యవస్థపై ప్రజల్లో నెలకొన్న విశ్వాసానికి నిదర్శనంగా నిలిచిందని మంత్రి ప్రకటించారు. పనితీరును మెరుగుపరచడం, సేవల లభ్యతను విస్తరించడం, కొత్త పౌర సేవలను అందుబాటులోకి తీసుకురావడం, సాంకేతిక, మౌలిక వసతులను బలోపేతం చేయడం లాంటి చర్యల ఫలితంగానే ఈ మైలురాయి సాధ్యమైందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల ద్వారా ఎలాంటి అంతరాయం లేకుండా ప్రజలకు సేవలను అందించడంలో విశేష కృషి చేసిన నిర్వాహకులు, సాంకేతిక బృందాలను మంత్రి అభినందించారు. మీసేవ ద్వారా ప్రస్తుతం ఫ్యామిలీ కార్డు, ఆదాయ, కుల, నివాస ధ్రువపత్రాలు, వివిధ రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ యుటిలిటీ చెల్లింపులు, అలాగే పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సేవలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మీసేవ కేంద్రాల్లో డిజిటల్ వేదికల ద్వారా ప్రజలకు సులభంగా అందుబాటులో ఉన్నాయి. అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను మీసేవలో చేర్చడం, ఆధునిక సాంకేతికతను వినియోగించడం, సేవల నాణ్యత, వేగం, పారదర్శకతను మరింత మెరుగుపరచడం ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించేందుకు కట్టుబడి ఉన్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

---

## పేపర్ లీకేజీ బిల్లుకు చట్టబద్ధత

**పార్లమెంట్ ఆమోదించిన బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం**

**న్యూఢిల్లీ,ఆగస్ట్1(జై భీమ్ న్యూస్):**

దేశంలో పేపర్ లీకేజీలను అరికట్టేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ అమెండ్‌మెంట్ బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం ఆమోదించారు. దీంతో ఇకపై ఈ బిల్లు చట్టంగా అమలులోకి రానుంది. 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్, 2026' పేరుతో రూపొందిన ఈ బిల్లును ఈ వారంలోనే పార్లమెంట్ ఆమోదించింది. అటు లోక్‌సభలో చర్చ అనంతరం ఆమోదం పొందగా, మరుసటి రోజు రాజ్యసభలో కూడా ఆమోదం లభించింది. దీంతో వెంటనే ఈ బిల్లు ఆమోదం కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వద్దకు పంపింది ప్రభుత్వం. ఇటీవల నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా సీజేపీ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన ఆందోళన గురించి తెలిసిందే. ఈ ఉద్యమం నేపథ్యంలో కేంద్రం పేపర్ లీకేజీలను అరికట్టేలా కొత్త బిల్లును తీసుకొచ్చింది. ఇదే అంశంలో 2024లో తెచ్చిన బిల్లుకు సవరణలు తెస్తూ కొత్త బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లును కాంగ్రెస్ సహా అనేక ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. ఈ బిల్లు ద్వారా పూర్తిస్థాయిలో పేపర్ లీకేజీలను అరికట్టలేమని ప్ర తిపక్షాలు వ్యాఖ్యానించాయి. అయితే, పేపర్ లీకేజీలను అడ్డుకునేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందువల్లే కొత్త బిల్లును రూపొందించామని కేంద్రం సమర్థించుకుంది. కొత్త బిల్లు ప్రకారం పేపర్ లీకేజీకి పాల్పడితే కఠిన శిక్షలు, జరిమానాలు విధిస్తారు. ఈ బిల్లులోని ప్రధానాంశాలివి. పేపర్ లీకేజీ కేసులను విచారించేందుకు ప్రతి రాష్ట్రంలో ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తారు. 90 రోజుల్లోనే విచారణ పూర్తి చేసి, శిక్షలు విధించేలా ఈ కోర్టులు నిరంతరం పని చేస్తాయి. పాత బిల్లు ప్రకారం పేపర్ లీకేజీకి పాల్పడితే వ్యక్తిగతంగా రూ.10 లక్షల వరకు జరిమానా విధించేవారు. కొత్త బిల్లు ప్రకారం రూ.50 లక్షల వరకు జరిమానా విధిస్తారు. ఒకవేళ సంస్థలు, వ్యవస్థీకృతంగా నేరానికి పాల్పడితే రూ.10 కోట్ల వరకు జరిమానా విధిస్తారు. అలాగే, గతంలో గరిష్టంగా మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు శిక్ష విధించేవారు. ఇప్పుడు ఐదు నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. ఇంతకుముందు కేంద్ర దర్యాప్తు సంస్థలు పేపర్ లీకేజీ కేసులపై విచారణ జరిపేది. కానీ, ఇకపై స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంలు ఈ కేసుల్ని విచారిస్తాయి. గతంలో పేపర్ లీకేజీ కేసుల విచారణకు కాల పరిమితి అంటూ లేదు. కొత్త బిల్లు ప్రకారం ఈ కేసుల విచారణను రెండు నెలల్లో పూర్తి చేయాలి.

## గ్రూప్ నోటిఫికేషన్ రాకపోవడంపై మనస్తాపం

**ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ యువకుడు**

**ఖమ్మం,ఆగస్ట్1(జై భీమ్ న్యూస్):**

గ్రూప్స్ నోటిఫికేషన్ రావడం లేదని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ముదిగొండ మండలంలో కలకలం రేపింది. యువతకు ఉద్యోగాలు హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కాలయాపన చేస్తుండడంతో విసిగిపోయిన న్యూ లక్ష్మీపురంవాసి గడ్డం వేణు కుమార్ ఎలుకల మందు, ఇతర మాత్రలు తీసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. ప్రస్తుతం ఐసీయూలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న అతడు తాను ఎందుకు ఆత్మహత్యకు ప్రయత్నించాడో సూసైడ్ లేఖలో వెల్లడించాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం ముత్తారం శివారులోని ప్లలె చెరువులోని మిషన్ భగీరథ ప్లాంట్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న వేణు కుమార్ పీజీ వరకూ చదివాడు. గత అయిదేళ్లుగా గ్రూప్స్ కోసం ప్రిపేర్ అవుతున్నాడు. ప్రతి రోజు ఎ÷-లాంటు వద్దకు వెళ్లి.. పని చూసుకుంటూ.. అక్కడే చదువుకుని సాయంత్రం ఇంటికి వస్తాడు. రోజులానే శనివారం కూడా ఇంట్లో నుంచి వెళ్లాడు. అయితే.. సాయంత్రం సమయంలో నిరుద్యోగుల వాట్సాప్ గ్రూప్‌లో సూసైట్ నోట్ పోస్ట్ చేసి అతడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రూపులో ఉన్నవారు అప్రమత్తమై వెంటనే అతడి తండ్రికి సమాచారం ఇవ్వగా.. వెళ్లి చూసేసరికి వేణు అపస్మారక స్థితిలో ఉన్నాడు. హుటాహుటిన అతడిని వైద్య చికిత్స నిమిత్తం ఖమ్మంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వేణు ఆత్మహత్యకు ప్రయత్నించిన చోట ఎలకల మందు, గుర్తు తెలియని మాత్రలను గుర్తించారు. ప్రస్తుతం ఐసీయూలో ఉన్న వేణు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. గ్రూప్ నోటిఫికేషన్ ఇవ్వడంలేదని మనస్తాపానికి గురై తను ఆత్మహత్యాయత్నం చేశానని సూసైడ్ లేఖలో వేణు కుమార్ వెల్లడించాడు.

## న్యాయవాది దారుణం హత్య

**విచక్షణారహితంగా వేటకొడవళ్లతో నరికి హత్య**

**నాగర్‌కర్నూల్,ఆగస్ట్1(జై భీమ్ న్యూస్):**

జిల్లాలో ఓ న్యాయవాది అత్యంత దారుణంగా హత్యకు గురయ్యారు. పెంట్లవెల్లికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు, న్యాయవాది మల్లయ్య (55)పై దుండగులు పథకం ప్రకారం దాడి చేసి వేటకొడవళ్లతో నరికి చంపారు. ఈ ఘటన జిల్లాలో తీవ్ర సంచలనం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లయ్య పెంట్లవెల్లిలో క్లినిక్ నిర్వహిస్తూ ఆర్ఎంపీ వైద్యుడిగా, న్యాయవాదిగా జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఆయన క్లినిక్‌లో ఉండగా ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు ఆరోగ్య సమస్య ఉందని చెప్పి అక్కడికి వచ్చారు. వారిని పరిశీలిస్తున్న సమయంలో ఒక్కసారిగా మల్లయ్య కళ్లలో కారం చల్లి దాడికి పాల్పడ్డారు. అనంతరం ఆయనను క్లినిక్ నుంచి బయటకు ప్రధాన రహదారిపైకి లాక్కెళ్లి వేటకొడవళ్లతో విచక్షణారహితంగా నరికి హత్య చేశారు. తీవ్ర గాయాలతో మల్లయ్య అక్కడికక్కడే మృతిచెందారు. దాడి అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మల్లయ్య హత్య వెనుక భూ వివాదాలే ప్రధాన కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### మాజీ ఎమ్మెల్యే కోసం పోలీసుల గాలింపు

ఏలూరు,ఆగస్ట్1(జై భీమ్ న్యూస్): గుంటూరు తూర్పు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు ముస్తఫా కోసం ఏలూరు జిల్లా నూజివీడు పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు ఆయన కుమారుడు బషీర్‌పై పలు క్రిమినల్ కేసులు నమోదు కావడంతో ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో వారి వివరాలు తెలిస్తే చెప్పాలని కోరుతూ సోషల్ మీడియా వేదికగా ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. పొగాకు లోడుతో వెళుతున్న వాహనాన్ని బలవంతంగా తీసుకెళ్లడం, బాధితులను డబ్బు కోసం అపహరించడం, కులం పేరుతో దూషించడం వంటి ఆరోపణలపై మాజీ ఎమ్మెల్యే ముస్తఫా, ఆయన కుమారుడు బషీర్‌పై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి ముస్తఫా, బషీర్ పోలీసులకు కనిపించకుండా తిరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. అదే సమయంలో వారి ఆచూకీ తెలిసిన వారు వెంటనే సమాచారం అందించాలని కోరుతూ నూజివీడు పోలీసులు సోషల్ మీడియాలో ప్రకటన విడుదల చేశారు. ముస్తఫా, బషీర్ వివరాలు తెలిసిన వారు 9154876161, 9154876238 నంబర్లకు సమాచారం అందించి దర్యాప్తునకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు హామీ ఇచ్చారు. కాగా, ఈ వ్యవహారం ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

# జూలో రెండు జంతువులను దత్తత తీసుకున్న అన్నా కొణిదెల



❤️ Pawan Kalyan & Anna Konidela Beautiful Couple Moments 🥰

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా కొణిదెల (అన్నా లెజినోవా) మరోసారి తన సేవా దృక్పథంతో ప్రశంసలు అందుకుంటున్నారు. గత కొంతకాలంగా సోషల్ మీడియాలో చురుకుగా ఉంటున్న ఆమె.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల తనకున్న గౌరవాన్ని తరచూ పంచుకుంటూ అభిమానులకు మరింత చేరువవుతున్నారు. రష్యాలో జన్మించినప్పటికీ భారతీయ ఆచారాలను పాటిస్తూ పూజలు, పండుగలు, కుటుంబ వేడుకల్లో సంప్రదాయ దుస్తులతో కనిపించే అన్నా కొణిదెలకు ఇప్పటికే సోషల్ మీడియాలో మంచి ఆదరణ ఉంది. ఇప్పుడు ఆమె తీసుకున్న మరో నిర్ణయం అందరి ప్రశంసలను అందుకుంటోంది. తాజాగా అన్నా కొణిదెల హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్క్‌లోని రెండు జంతువులను దత్తత తీసుకున్నారు. అందులో ఒకటి ఆసియా ఏనుగు, మరొకటి రాయల్ బెంగాల్ టైగర్. ఈ జంతువుల ఆహారం, వైద్య సంరక్షణతో పాటు ఇతర నిర్వహణ ఖర్చులను ఇకపై ఆమె భరిస్తారని సమాచారం. జూ పార్క్‌లో ఆయా జంతువుల వద్ద అన్నా కొణిదెల దత్తత తీసుకున్నట్లు ప్రత్యేక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఇంతకుముందు పవన్ కళ్యాణ్ కూడా విశాఖపట్నం జూలో జిరాఫీలను దత్తత తీసుకుని జంతు సంరక్షణకు తన వంతు సహకారం అందించారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో అన్నా కొణిదెల కూడా ముందుకు రావడం అభిమానులను ఆకట్టుకుంటోంది.

# టాక్సిక్ ట్రైలర్ 8న గ్రాండ్‌గా విడుదల

కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ వరల్డ్ మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా ఒక అదిరిపోయే అప్డేట్ అందించారు. సినిమా ప్రమోషన్స్ లో భాగంగా చిత్ర యూనిట్ తాజాగా ట్రైలర్ రిలీజ్ డేట్ ను అధికారికంగా ప్రకటించడంతో పాటు, ఒక సరికొత్త పోస్టర్ ను విడుదల చేసి సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చారు. గీతూ మోహన్ దాస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ సాలిడ్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే సినీ వర్గాలలో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. రీసెంట్ గా రామాయణ ప్రాజెక్ట్ తో పాటు రావణాసురుడి పాత్రలో యష్ గెటప్ మరియు ప్రెజెన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ సినిమా కంటే ముందే బాక్సాఫీస్ ముందుకు రాబోతున్న 'టాక్సిక్' తో యష్ ఏ స్థాయిలో విధ్వంసం సృష్టిస్తాడనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో తాజాగా విడుదల చేసిన బ్లాక్ అండ్ వైట్ పోస్టర్ సినిమా మూడ్ ఏంటో స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ పోస్టర్ తో పాటు మేకర్స్ అనౌన్స్ చేసిన వివరాల ప్రకారం, ఈ భారీ బ్జడెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమా ట్రైలర్ ను వచ్చే ఆగస్టు 8 న అత్యంత గ్రాండ్ గా లాంచ్ చేయనున్నారు. ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి వంటి స్టార్ హీరోయిన్లు, నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ (మరియు మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్)సంయుక్తంగా అత్యంత భారీ బ్జడెట్ తో ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఇక కేజీఎఫ్ లాంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత కేవీఎన్ ప్రొడక్షన్స్ తో యష్ చేస్తున్న ఈ ప్రాజెక్ట్ పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి.



# పెళ్ళి చుట్టూ సాగే కథతో క్రేజీ కళ్యాణం

అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ రాజ్, నరేష్ వీకే కీలక పాత్రల్లో నటిస్తున్న ఎంటర్‌టైనర్ 'క్రేజీ కళ్యాణం'. బద్రప్ప గాజుల దర్శకుడు. బూసమ్ జగన్ మోహన్‌రెడ్డి నిర్మిస్తున్నారు. శనివారం ఈ చిత్ర టీజర్ విడుదలైంది. పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికరమైన కథతో పూర్తి వినోదాత్మక చిత్రంగా దీన్ని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. సురేశ్ బొబ్బిలి ఈ సినిమాకు సంగీతం అందించారు.




# 9న మహేశ్ బాబు పుట్టిన రోజు



## వారణాసి నుంచి అప్‌డేట్ కోసం అభిమానుల చూపు

సూపర్ స్టార్ మహేష్ బాబు అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే నెల ఆగస్టు వచ్చేసింది. ప్రతి ఏడాది ఆగస్టు 9న మహేష్ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో భారీ స్థాయిలో సందడి నెలకొంటుంది. ఈసారి కూడా అభిమానులు ఎస్-ఎస్‌ఎంబీ మంత్ పేరుతో సెలబ్రేషన్స్ ప్రారంభించగా, అందరి దృష్టి ఇప్పుడు ఒకే విషయంపై ఉంది.. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వారణాసి' సినిమా నుంచి ఏదైనా ప్రత్యేక అప్‌డేట్ వస్తుందా అని చూస్తున్నారు. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ప్రాజెక్ట్‌లలో ఒకటిగా నిలిచింది. అడ్వెంచర్ నేపథ్యంలో భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా మాత్రమే కాదు, అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆసక్తి నెలకొంది. మహేష్ బాబు కూడా ఈ సినిమా కోసం పూర్తిగా కొత్త లుక్, ప్రత్యేకమైన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో కనిపించనున్నట్లు సమాచారం. చిత్ర బృందం ఇప్పటికే సినిమా షూటింగ్‌లో కీలక భాగాన్ని పూర్తి చేసినట్లు సమాచారం. ప్రస్తుతం మరికొన్ని భారీ యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కొనసాగుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా లుక్ గోప్యంగా ఉండేలా రాజమౌళి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారని, అందుకే మహేష్ బాబు ఇటీవల కాలంలో పబ్లిక్ ఈవెంట్లకు కూడా చాలా తక్కువగా హాజరవుతున్నారని తెలుస్తోంది. మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన సినిమాలకు సంబంధించిన పోస్టర్, టీజర్ లేదా గ్లింప్స్ విడుదల చేయడం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా 'వారణాసి' నుంచి ప్రత్యేక అప్‌డేట్ ఉంటుందనే ఆశతో అభిమానులు ఎదురుచూస్తున్నారు.